# 15వ రోజులు గడిచిన లభించని హరికృష్ణ రెడ్డి ఆచూకీ

## - మంత్రి గొట్టిపాటి చొరవతో కొనసాగుతున్న గాలింపు చర్యలు



**అద్దంకి , జనవరి 12, ప్రభాతవార్త**

అమెరికాలో అదృశ్యమైన ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలానికి చెందిన యువకుడు కారసాని హరికృష్ణ రెడ్డి 15 రోజులు గడిచిన కూడ ఆచూకీ లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలం కాకపోవడం, భారీ హిమపాతం వలన వల్ల గాలింపు చర్యలు సవాలుగా మారినప్పటికీ, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో గాలింపుచర్యలు వేగవంతంగా, ముమ్మరంగా కొనసాగుతున్నాయి. హరికృష్ణ రెడ్డి డిసెంబర్ 30 నుండి మొబైల్ సిగ్నల్ అందకపోవడం, 31వ తేదీన డెనాలి లాడ్జ్ రూమ్ ఖాళీ చేయడం, అంతరంగిక పరిసరాల సమాచారం ప్రకారం, అతను ఎక్కడో సురక్షితంగా ఉండే అవకాశాన్ని వుందని ఆశాభావాన్ని కుటుంబం, స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

### శోధనలు, వాతావరణ సవాళ్లు :

అలాస్కాలో కచ్చితమైన ప్రాంతంలో భారీ మంచు, కఠినమైన వాతావరణ పరిస్థితుల మధ్య అమెరికా స్టేట్ ట్రూపర్స్, స్థానిక అధికారులు, రాయబార కార్యాలయం సహకారంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వాతావరణం అనుకూలం కాకపోవడం, రహదారులు మంచుతో మూసివేయబడడం వలన శోధనకు మరిన్ని బృందాలు పాల్గొని పరిశోధనలు కొనసాగిస్తున్నాయి.

### మంత్రి చొరవ అంతర్జాతీయ స్థాయి సమన్వయం :

హరికృష్ణ రెడ్డి అదృశ్యమైన వార్త తెలుసుకున్న వెంటనే మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించి, కుటుంబంతో నేరుగా చరవాణి ద్వారా సంప్రదించి ధైర్యం కల్పించారు. అనంతరం విదేశాంగ శాఖ, అమెరికా రాయబార కార్యాలయం, స్థానిక పోలీస్ విభాగాలతో సమన్వయం పెంచి గాలింపు చర్యలు మరింత వేగవంతం చేయడం జరిగింది.

### ఆశాభావంతో ఎదురుచూపులు :

15వ రోజు కూడా ఆచూకీ లేనప్పటికీ, డిసెంబర్ 30-31 నుండి లభ్యమైన ప్రాథమిక సమాచారం ఆధారంగా, హరికృష్ణ రెడ్డి ఎక్కడో సురక్షితంగా ఉండే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భావిస్తున్నారు. ప్రభుత్వ స్థాయి చొరవతో గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో, ప్రజలలో, కుటుంబంలో ఆశాభావం కొనసాగుతోంది. స్థానికులు, కుటుంబ సభ్యులు హరికృష్ణ రెడ్డి క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థిస్తున్నారు.

# అద్దంకి నియోజకవర్గ ప్రజలకు చింతలపూడి సంక్రాంతి శుభాకాంక్షలు



**అద్దంకి, జనవరి 13, ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అద్దంకి నియోజకవర్గ ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ, భోగి పండుగ మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, పాత వాటిని విడిచిపెట్టి కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో ముందుకు సాగే పర్వదినమని అన్నారు. ఈ పండుగ ప్రతి ఇంట్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు.

# జిల్లా ప్రజలకు బాలినేని శ్రీనివాసరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు



**ఒంగోలు, ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు మాజీ మంత్రి, రాష్ట్ర జనసేన నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సొంత గ్రామాలపై మమకారానికి మనమంతా ఇచ్చే గౌరవానికి సంక్రాంతి పండుగ ఒక ప్రతీక. భోగి మంటలు, రంగు వల్లులు, హరి దాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్లు, పైరు పచ్చళ్ళ కళకళలు గ్రామాల్లో ఎనలేని సంక్రాంతి శోభను తీసుకుని వచ్చాయి. ఈ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను జిల్లాలోని ప్రతి కుటుంబం ఎంతో సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటున్నానని బాలినేని అన్నారు.

# తెలుగు ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి

## - ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంక్రాంతి శుభాకాంక్షలు



**మార్టూరు, జనవరి 13, ప్రభాతవార్త**

మకర సంక్రాంతిని పురస్కరించుకుని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికి హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు సొంత గ్రామాల పట్ల మనకున్న మమకారాన్ని ప్రతిబింబించే గొప్ప పండుగ సంక్రాంతి అని ఆయన పేర్కొన్నారు. భోగి మంటలు, రంగు వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్ళు, పైరు పచ్చల కళకళలతో గ్రామీణ ప్రాంతాలు సంక్రాంతి శోభతో కళకళలాడుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. దేదీప్యమానంగా వెలిగే భోగి మంటలు ప్రజలందరికి కొత్త వెలుగులు, కొత్త ఆశలు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆనందోత్సాహాలతో ఐకమత్యంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం భోగభాగ్యాలతో తులతూగుతూ, ఆరోగ్యం, ఆనందాలతో జీవించాలని, ఈ సంక్రాంతి పర్వదినం రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుభిక్షం, శాంతి, సమృద్ధిని నింపాలని ఆయన ప్రార్థించారు.

# ప్రకాశం వార్త

తెలుగు జాతీయ దినపత్రిక



# సంబరాల సం'క్రాంతి'

## - భోగి మంటలతో.. పిండి వంటతో.. రంగవల్లులతో.. గొబ్బెమ్మలతో.. బసవన్నలతో.. హరిదాసులతో.. పల్లె అందాలతో.. అందరిని ఒక దగ్గరికి చేర్చి.. పలకరించేదే సంక్రాంతి..!

**ఒంగోలు, ప్రభాతవార్త**

సంక్రాంతి.. పేరులోనే ఉంది క్రాంతి. సంక్రాంతి అనగానే ముందుగా గుర్తుకొచ్చేది పాడి పంటలు, పచ్చని పల్లెల వాతావరణం, ఆరుగాలం రైతు చెమటోర్చి పండించిన పంట చేతికొచ్చే సమయమిది ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వేడుకలా చేసుకునే పండుగే సంక్రాంతి. ఆంధ్రులు జరుపుకునే ముఖ్యమైన పండుగలలో సంక్రాంతి ఒకటి.

### భోగి భాగ్యాల భోగి :

సంక్రాంతికి ముందు రోజు జరుపుకునే పండుగే భోగి. భోగి అంటే గోదాదేవి శ్రీ రంగనాధుని సేవించి కళ్యాణ భోగం అనుభవించిన రోజు. ఆ రోజు చలిపులిని తరిమికొడుతూ చలి మంటలు వేసుకుని చలి కాచుకుంటారు. తమలోని పాత ఆలోచనను ఆ అగ్నికి ఆహుతై కొత్త ఆలోచనలు చిగురించాలని అగ్ని దేవుణ్ణి వేడుకునేందుకు గుర్తుగా తమ ఇంటిలోని పాత, చెత్త చెదారాన్ని అగ్నిలో ఆహుతి చేస్తారు. భోగి రోజు చిన్నారులకు రేగి పళ్ళలో పప్పు బెళ్ళాలు, పువ్వులు, డబ్బులు జోడించి భోగి పళ్ళు పోస్తారు. రేగిపళ్ళు సూర్యునికి ప్రీతికరమైనవి. పిల్లల తలపై భోగి పళ్ళు పోయడం వల్ల సూర్యుని ఆశీస్సు లభిస్తుందని నమ్మకం.

### మకర సంక్రాంతి :

సూర్యుడు మకర రాశిలో ప్రవేశిస్తున్నందున పండుగలో రెండో రోజును మకర సంక్రాంతి అంటారు. రెండో రోజు అయిన సంక్రాంతి రోజు పిండి వంటలు చేసి సూర్య దేవునికి నైవేద్యంగా ప్రసాదం సమర్పిస్తారు. ఆ రోజు నువ్వులు, బెల్లం దానం చేస్తే సూర్యభగవానుడు ఆశీస్సులు కలుగుతాయి. ఇంటిముందు ముగ్గులు వేసి రక రకాల రంగులు పూళ్ళతో అలంకరణలు చేసి పేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచుతారు. ముగ్గుల చుట్టూ బతుకమ్మలు వేస్తూ ఆటపాటలతో మహిళలు సంబరాలు చేసుకుంటారు.

### కమ్మని విందుల కనుమ :



సంక్రాంతి పండుగలో మూడో రోజు జరుపుకునేది కనుమ. ఈ రోజున రైతులు వ్యవసాయంలో తమకు తోడుగా నిలిచిన పశువులను పూజిస్తారు. తాము పండించిన పంటతో పొంగలి తయారు చేసి పశువులకు నైవేద్యంగా పెడతారు. అంతే కాదు కనుమ రోజున కుటుంబంతో కలిసి, బంధువులతో కలిసి విందు భోజనాలు చేస్తారు. కనుమ రోజుగా జోరుగా కోడి పందాలు, ఎడ్ల పందాలు నిర్వహిస్తారు. సంక్రాంతి పండుగలో వరుసగా నాలుగో రోజున ముక్కనుమ అంటారు. ముక్కనుమ అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ పండుగను ఎక్కువగా ఏపీలో జరుపుకుంటారు. ఆ రోజు మాంసాహారాన్ని తింటారు. కాగా కనుమ ముక్కనుమ రోజున ప్రయాణాలు కూడా చేయకూడదు. ఆ రోజు దేవతలందరూ మన ఇంటికి వస్తారని కనుమ పండుగ రోజున శని సంబంధిత నక్షత్ర ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుందని ప్రయాణాలు చేస్తే కీడు జరుగుతుందని పండితులు చెప్తున్నారు.



# భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**కంభం, జనవరి 13 ప్రభాతవార్త**



ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు అన్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, అలాగే సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. గెలిచిన వెంటనే కూటమి ప్రభుత్వం వాటిని మరిచిపోయిందని ఇప్పటివరకు భవన నిర్మాణ సంక్షేమం విస్మరించిందన్నారు. కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించలేదని తెలిపారు. కార్మికుల మీద, శ్రామిక కుటుంబాల మీద వారి బాగోగులను మీద ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరుకుంటూ, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కంభం సహాయ కార్మిక అధికారి ఎదుట ధర్నా చేసిన అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

# జనాభా లెక్కల పక్రియను ముందస్తు చర్యలపై దృష్టి పెట్టాలి







**ఒంగోలు, ప్రభాతవార్త**

అధికారికంగా జనాభా లెక్కల పక్రియను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలపై దృష్టి పెట్టినట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిఎస్ఎస్ రావత్(ఇన్‌చార్జి), సన్సస్ డైరక్టర్ నివాస్ మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటికే చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు జనాభా గణనపై ఆరా తీయడంతో పాటు పూర్తిస్థాయిలో జనాభాలెక్కలు కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంపై పలు సూచనలు చేశారు. ఈసారి జనాభా లెక్కలను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, జియో మ్యాపింగ్ ఆధారంగా చేపట్టనున్నందున జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజన జరిగినందున వాటి సరిహద్దులను నిర్ధారించడంతో పాటు సంబంధిత మ్యాప్‌ను ఈ నెల 20వ తేదీ నాటికి ఢిల్లీ పంపించాలని చెప్పారు. జనగణన కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అనుసరించాల్సిన పక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివాస్ వివరించారు. కాగా, ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ఉద్యోగుల ప్రమోషన్ల పక్రియను కూడా ఈ నెలాఖరులోగా పూర్తిగా చేయాలని రావత్ చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో బి.చిన ఓబులేసు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ఆర్డీవోలు, మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

# ఆదర్శవంతుడు కారుసాల సింగయ్య చౌదరి

## - అభిమానుల గుండెల్లో ఆయన అమరజీవి - విగ్రహావిష్కరణకు ఆహ్వానించిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు

## - రావినూతలకు విద్యావంతుల గ్రామంగా గుర్తింపు - సింగయ్య విగ్రహా ఆవిష్కరణ సభలో మంత్రి గొట్టిపాటి





**కొరిసపాడు, జనవరి 13, ప్రభాతవార్త :**

అభిమానుల గుండెలలో అమరజీవిగా, ఆదర్శవంతుడుగా సింగయ్య చౌదరి నిలిచివుంటాడని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం రావినూతల గ్రామంలో సింగయ్య చౌదరి విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సుదీర్ఘకాలం రావినూతల పిఎసిఎస్ అధ్యక్షుడిగాను పిడిసిసి బ్యాంక్ ఒంగోలు డైరెక్టర్ గా విశిష్ట సేవలు అందించిన సింగయ్య చౌదరిమరణించి మూడు సంవత్సరాలు గడిచిన గ్రామస్తుల, అభిమానుల గుండెల్లో జీవించే ఉన్నాడని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం రావినూతల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆవరణలో ఏర్పాటుచేసిన కారుసాల సింగయ్య చౌదరి విగ్రహాన్ని మంత్రి, ప్రముఖ నటుడు యర్రా రఘుబాబు పలువురు ప్రముఖులతోకలిసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రిగొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ సింగయ్య చౌదరి విగ్రహా ఆవిష్కరణకు తనను ఆహ్వానించిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. తాను 2009లో అద్దంకి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి సింగయ్య చౌదరితో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. 2011 ప్రాంతంలో గ్రామంలో సొసైటీ బిల్డింగ్ ప్రారంభోత్సవానికి దగ్గుబాటి పురంధరేశ్వరిని ఆహ్వానించుదామని తన వద్దకు వచ్చారన్నారు. 1983లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తో గ్రామంలోని పిఎసిఎస్ లో రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని ప్రారంభింపజేశానని, ఎన్టీఆర్ తనయ పురంధరేశ్వరిని తప్పక ప్రారంభోత్సవానికి తీసుకురావాలని గట్టిపట్టు పట్టారన్నారు. తాను అప్పటి పార్లమెంటు సభ్యురాలు మంత్రి అయిన పనబాకలక్ష్మికి ఈ విషయం తెలుపగా ఆమె సహృదయంతో దగ్గుబాటి పురంధరేశ్వరి తో మాట్లాడి సొసైటీ బిల్డింగ్ ప్రారంభోత్సవానికి సహకరించారన్నారు. సహకార రంగంలో మూడు దశాబ్దాలకు పైగా అధ్యక్షునిగా కొనసాగటం మామూలు విషయం కాదని అదే సింగయ్య చౌదరి ప్రతిభఅన్నారు. అద్దంకి నియోజకవర్గంలో 38 సహకార సంఘాలు ఉన్నాయని అందులో రావినూతల, వెల్లలచెరువు సహకార సంఘాలు పనితీరులో రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చుకున్నాయన్నారు. మిగతా సహకార సంఘాలు కూడా వాటితో పోటీపడి పనితీరు మెరుగుపరుచుకోవాలని మంత్రి హితవు పలికారు. కొద్దిరోజుల క్రితం తాను ఒంగోలులోని పివిఆర్ హైస్కూల్ శతజయంతి ఉత్సవాలలో పాల్గొన్నానని అక్కడ ఈ గ్రామం గురించి ఇక్కడి హైస్కూల్ గురించి ప్రస్తావించానన్నారు. 1947,48 ప్రాంతంలో ఆనాటి పెద్దల సహకారంతో ఈ గ్రామంలో హైస్కూల్ ఏర్పడిందన్నారు. ఈ హైస్కూల్లో చదువుకొని ఈ గ్రామస్తులేకాకుండా పరిసర గ్రామాల ప్రజలు కూడా చదువుకుని ఉన్నతవిద్యావంతులై దేశ విదేశాలలో హై స్కూల్ కే కాకుండా రావినూతల గ్రామానికి కూడా గుర్తింపు తెచ్చారన్నారు. రావినూతల గ్రామ హై స్కూల్‌ను నియోజకవర్గం లోని మిగతా పాఠశాలలు ఆదర్శంగా తీసుకోవాలి అన్నారు. ప్రభుత్వం అన్ని పనులు చేయలేదు కాబట్టి నా వంతు ప్రయత్నంగా ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచడానికి అక్కడ చదివే విద్యార్థులకు పాఠశాలలకు రాకపోకలకై తాను ఇప్పటికే విద్యార్థిని విద్యార్థులకు 6500 సైకిళ్లకు పైగా దాతల సహకారంతో ఉచితంగా పంపిణీ కార్యక్రమం చేపట్టానన్నారు. ఈ సైకిల్ పంపిణీ కి రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు కాకుండా విదేశీ సంస్థలు కూడా సహకరిస్తున్నారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని సౌకర్యాల కల్పనకై కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. మన నియోజకవర్గంలో సైకిల్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని మంత్రి నారాయణ, హోమ్ మంత్రి అనిత, వైద్యశాఖ మంత్రులు కూడా ఈ సైకిల్ పంపిణీ కార్యక్రమాన్ని తమ నియోజకవర్గాలలో చేపట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో సౌకర్యాల కోసంప్రభుత్వం తోపాటు మన వంతు సాయంగా ఈ సైకిల్ పంపిణీ కార్యక్రమాలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో 103గ్రామాలలో 40 గ్రామాల లో హై స్కూల్ ఉన్నాయని వాటి పనితీరును మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామన్నారు. ఏది ఏమైనా సింగయ్య చౌదరి ఆదర్శనీయుడని చిరస్మరణీయుడు అంటూ ఆయన పయనించిన బాటలో కుటుంబ సభ్యులు మనము అనుసరించుదామంటూ మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఆయనతోపాటు ప్రముఖ సినీ నటులు యర్రా రఘు బాబు, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, పిఏసిఎస్ అధ్యక్షుడు పూనాటి వెంకట్రావు ,ఆర్ ఎస్ సి ఏఅధ్యక్షుడు కారుసాలబాబు, గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు ఈడ్పు గంటి హృదయనాద్, కుర్రవాని పాలెం సర్పంచ్ నాదెండ్ల దశరధ రామయ్య, నాదెండ్ల కోటేశ్వరరావు, గురు బాబు, సాదినేని మస్తాన్‌రావు, మోపర్తి లక్ష్మీనారాయణ, మేదరమెట్లశ్రీనివాసరావు, చెన్నుపాటి హరిబాబుల తో పాటు సింగయ్య చౌదరి అభిమానులు రావినూతల గ్రామస్తులతోపాటు జిల్లాలోని, మండలంలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ట్రాక్టర్ దొంగల ఆట కట్టించిన బల్లికురవ పోలీసులు

## - ఒక ట్రాక్టర్ ట్రక్కు, ఐదు రోటవేటర్లు స్వాధీనం - రెండు రోజుల, వ్యవధిలోనే దొంగల పని పట్టారు

## - జిల్లా ఎస్పీ ప్రత్యేక అభినందనలు





**బల్లికురవ , జనవరి 13,ప్రభాతవార్త**

నలుగురు జల్సారాయుళ్లు కూటమి కట్టారు. చిన్న చిన్న దొంగతనాలు అయితే జల్సాలు తీరుతాయి. ఏదైనా సరే కొడితే కుంభస్థలమే కొట్టాలి, కొట్టేస్తే ట్రాక్టర్ తో సహా ట్రక్కులు, పల్లెల్లో అన్నదాతలు ఇంటి ముందు వుండే రోటవేటర్లు, ఇతర వ్యవసాయ పరికరాల చోరీనే లక్ష్యంగా ఆ నలుగురు చెల రేగి పోయారు. వివరాలలోకి వెళితే మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో దొప్పలపూడి వెంకట్రావుకు చెందిన ట్రాక్టర్ టక్కును దొంగిలించారు. వెంకట్రావు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన బల్లికురవ ఎస్సై నాగరాజు గుట్టు చప్పుడు కాకుండా, చాకచక్యంగా ట్రాక్టర్ పరికరాల దొంగల సమాచారాన్ని సేకరించారు. డి.ఎస్.పిలక్ష్మీనారాయణ సారథ్యంలో, సీఐ కే వెంకట్రావు ఆధ్వర్యంలో, ఎస్సై నాగరాజు దొంగల వేట కొనసాగించి, రెండు రోజుల్లోనే వారి ఆట కట్టించారు. మంగళవారం సాయంత్రంచోరీలకు పాల్పడుతున్న నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి, వారి వద్ద నుండి సుమారు 8 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిల వివరాలు, వినుకొండ మండలం, గోకనకొండ గ్రామానికి చెందిన అంకం శెట్టి బాలాంజనేయులు, వల్లెం నాగరాజు, కొండి వెంకటేశు, దిద్దుల అంకమ్మరావు లపై కేసు నమోదు చేశారు.

**బల్లికుర పోలీసులు రికవరీ చేసిన సొత్తు వివరాలు :**

మండల పరిధిలో నమోదైన 3 కేసుల్లో ఒక ట్రాక్టర్ ట్రాలీ, రెండు రోటవేటర్లు; మార్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక కేసులో ఒక రోటవేటర్; అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక కేసులో ఒకరోటవేటర్, సంతమాగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక కేసులో ఒక రోటవేటర్‌మొత్తం 6 కేసుల్లో ఒక ట్రాక్టర్ ట్రాలీ, ఐదు రోటవేటర్లులను రకవరీ చేశారు. వీటి విలువ సుమారు 8 లక్షల పై మాటే. ముద్దాయిల నేపథ్యం చోరీ విధానం: ఈ నలుగురు ముద్దాయిలు పల్నాడు జిల్లా, వినుకొండ మండలం, గోకనకొండ గ్రామానికి చెందినవారు. వృత్తిరీత్యా ఇసుక ట్రాక్టర్లకు డ్రైవర్లుగా పనిచేస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. అయితే, చెడు వ్యసనాలకు బానిసలైన వీరు, తమ పని నుండి సరిపడా ఆదాయం రాకపోవడంతో ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. గత మూడు నెలలుగా రాత్రి సమయాల్లో చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ, రైతుల రోటవేటర్లు, ట్రాక్టర్ ట్రాలీలను దొంగిలించి, వాటిని అమ్ముకుని తమ చెడు వ్యసనాలను తీర్చుకునేందుకు అలవాటు పడ్డారు . ఈ క్రమంలో చెన్నుపల్లి గ్రామంలో ట్రక్కు చోరీకి పాల్పడి బల్లికురవ పోలీసుల నుండి తప్పించుకోలేకపోయారు. వ్యవసాయ పరికరాల చోరీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న దర్శి డిఎస్పిలక్ష్మీనారాయణ స్వయంగా ఈ చోరీలపై దృష్టిసారించి దొంగల కదిలికలపై నిఘా పెట్టి ఈ కేసులను చేధించడంలో ఎప్పటికప్పుడు సూచనలిస్తూ పర్యవేక్షించారు. అన్నదాతల ఆస్తుల పరిరక్షణలో రెండు రోజుల వ్యవస్థలోనే ముద్దాయిలను అదుపులోకి తీసుకోవడంతో, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, నేతలు రైతన్నల ఆస్తుల పరిరక్షణలో తక్షణ కర్తవ్యంగా రంగంలోకి దిగిముద్దాయిల ఆటకట్టించిన ఎస్ఐ నాగరాజును, సిబ్బందిని, ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. బల్లికురవ పోలీసుల మజాకానా. చోరీలకు పాల్పడే దొంగల్లారా మా నుండి తప్పించుకోలేరు. అంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముద్దాయి లను అద్దంకి కోర్టుకు తరలించారు. ఎస్ఐ నాగరాజు కేసును దరాప్తుచేస్తున్నారు.

# కని, విని ఎరుగని రీతిలో ఎడ్ల పందాల హోరు

## - చరిత్రలో నిలిచేలా బరిలో కాడెద్దుల జోడు - నియోజకవర్గ ప్రజల చూపు తాటిపర్తి వైపు




**యర్రగొండపాలెం రూరల్, జనవరి 13, ప్రభాతవార్త**

జిల్లాలోనే చిట్టచివరి ప్రాంతమైన యర్రగొండపాలెం ప్రజానీకం ఎన్నడూ కనీ వినీ ఎరుగని రీతిలో ఎడ్ల పందాల జోరు గత మూడు రోజుల నుండి హోరా హోరీగా సాగుతున్నాయి. రైతే రారాజు రైతు ఎప్పటికి తన ధైర్యాన్ని కోల్పోకూడదనే సంకల్పంతో సంక్రాంతి పండుగ ముందస్తుగానే చరిత్రలో నిలిచేలా రాష్ట్రమే వై.పాలెం వైపు చూసేలా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. దీంతో వారం రోజులు ముందుగానే సంక్రాంతి పండుగ కళ సంతరించుకుంది. సోమవారం న్యూ కేటగిరి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం వివిధ ప్రాంతాల నుండి పదుల సంఖ్యలో ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలు అర్ధరాత్రి వరకు సాగాయి. పెద్ద ఎత్తున పోటీల్లో ఎడ్లు పాల్గొంటుండడంతో ఎక్కువ సమయం సాగుతోంది. పెద్ద సంఖ్యలో మహిళలు కూడా వచ్చి పోటీలను తిలకిస్తున్నారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రజలకు భోజన వసతి, అల్పాహారం కల్పిస్తున్నారు. చివరగా బుధవారం సీనియర్ కేటగిరి ఎడ్ల బలప్రదర్శనతో పోటీలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు యర్రగొండపాలెంలోని కేవస్ పార్కు సమీపంలో మైదానం ఏర్పాటు చేశారు. ఈ పోటీలు ఈ నెల 11 నుండి 14 వరకు నిర్వహిస్తుండగా నిర్వహించే మొత్తం 4 కేటగిరి విభాగాల్లో 15 లక్షల రూపాయల నగదు బహుమతిని పాల్గొన్న ఎడ్ల యజమానులకు ఎమ్మెల్యే ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులను అందజేస్తూ, గ్రామీణ క్రీడలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని రైతు శ్రమకు గౌరవం శ్రమకు దగ్గర ఫలితం దగ్గర ఈ పోటీలను రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు చేస్తున్నామని అందరూ సహకరించి ఈ పోటీలను విజయవంతం చేయాల్సిందిగా ఆయన ప్రతి రోజు కోరుతున్నారు. ఎమ్మెల్యే పిలుపుని అందుకున్న అభిమానులు, వైసీపీ కార్యకర్తలు రాజకీయాలకు అతీతంగా పాల్గొంటున్నారు. ఉత్సాహభరితంగా జరుగుతున్నపోటీలను తిలకించి ముగ్ధులైపోతున్నారు.

6_6.qxd 1/14/2026 12:41 AM Page 1



# అత్యున్నత స్థాయి లక్ష్యాలను సాధించాలి



**బల్లికురవ, జనవరి 13, ప్రభాతవార్త**
అత్యున్నత స్థాయి లక్ష్యాలను ఆదుకోవాలంటే విద్యార్థులు కష్టమైనా ఇష్టంగా చదవడం నేర్చుకోవాలని నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే రీజనల్ ఇన్‌చార్జి కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని కొప్పెరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో 1వ, 2వ ర్యాంకులు సాధించిన ఇద్దరు విద్యార్థులు మాదాల హేమ స్రవంతి, కంబాల నాగసాయి చరణ్ తేజ్, బొంతుఅక్షయలకు ప్రోత్సాహకర బహుమతులు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రూ.10వేల ప్రోత్సాహకర బహుమతిని అందజేశారు. క్యూబ్ రూట్స్ ఫౌండేషన్ ప్రతి రంగంలోనూ విశేష ప్రతిభ కనపరిచిన వారికి తమ వంతు చేయూతగా ప్రోత్సాహకర బహుమతులు అందచేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు అంకితభావంతో అకుంఠిత దీక్షతో పరీక్షలు ఏమైనా ప్రథమ స్థానం తమదేనని లక్ష్యంతో పరీక్షల హాలులోకి సిద్ధంగా వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ళ సీఐ వెంకటరావు, ప్రాజెక్ట ఇన్‌చార్జి శ్రీకాంత్‌బాబు, ప్రసాద్, రాంబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పాఠశాల అధ్యాపక బృందం, గ్రామ ప్రముఖులు విద్యార్థులకు తమ ఆశీస్సులు అందజేశారు.

## బాలాదిత్య, వర్షశ్రీలకు మంత్రి గొట్టిపాటి ఆశీస్సులు





**బల్లికురవ, జనవరి 13, ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బల్లికురవ క్లస్టర్ ఇన్‌చార్జి మల్లినీడి గోవిందరావు మనుమడు బాలాదిత్య, వర్ష శ్రీలకు రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుభ ఆశీస్సులు అందజేశారు. చిన్నారుల నూతన వస్త్ర బహుకరణ కార్యక్రమం బుధవారం జరగనుంది. అయితే మంత్రి గొట్టిపాటి ఆ రోజు పాలనాపరమైన వ్యవహారాల్లో అందుబాటులో లేని కారణంగా మంగళవారం సాయంత్రం గుంటుపల్లిలోని గోవిందరావు నివాసానికి వెళ్లి చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి అక్షింతలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలోని వృద్ధులను ఆప్యాయంగా భుజాల మీద చేతులు వేసి క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్ ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారో వృద్ధుల నోటి ద్వారా వివరాలు రాబట్టారు. మల్లినీడి మహేష్‌బాబు దంపతులను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని టీడీపీ కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేల ఈనిందా అన్న చందంగా జన ప్రభంజనం

- ఇది ఏ అమ్మవారి తిరునాలబ్బా అంటూ కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపర్తి యాసా
- ఈ సంబరం చూస్తుంటే తాడిపత్రోళ్ళకు మాకే ఆశ్చర్యం
- నీ పాసుగూలా.. చంద్రశేఖర్ కూటమినే బెదరగొట్టావు గదయ్యాబాబు
- మూడవ రోజు న్యూకేటగిరి ఎద్దుల పోటీలలో 12 జతలు పాల్గొనగా గెలిచిన 9 జతలకు రూ.4,23000 నగదు బహుకరించిన ఎమ్మెల్యే



**యర్రగొండపాలెం, జనవరి 13, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన మూడవ రోజు ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతలు తరలి వచ్చారు. యర్రగొండపాలెం పట్టణంలోని పుల్లలచెరువు రోడ్డులో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల పందేల పోటీలలో భాగంగా మూడవ రోజు ఎమ్మెల్యే అధ్యక్షతన సభ జరిగింది. ముందుగా ముఖ్య అతిథిగా వచ్చిన కేతిరెడ్డి పెద్దారెడ్డి సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామూలుగా గ్రామాలలో జరిగే చిన్న వేడుక అనుకొని వచ్చానని అక్కడికి వచ్చిన తరువాత జరుగుతున్న ఎడ్ల పందేల సంబరం చూస్తుంటే ఆశ్చర్యం వేసిందని, ఇక్కడి ఏర్పాట్లు జనసందోహం చూస్తుంటే జాతరను మరిపిస్తుందని తాడిపర్తి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వ్యాఖ్యానించారు. తాటిపర్తి చంద్రశేఖర్ వ్యక్తిత్వం ఉన్న మంచి మనిషి అని ఇలాంటి వ్యక్తి ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా రావడం అదృష్టమని, ఇలాంటి మంచి వ్యక్తి కోసం ఎలాంటి అవసరం ఉన్న సహాయపడడానికి ఈ పెద్దారెడ్డి ఉంటాడని అన్నారు. జగనన్నతోనే స్నేహం నెరిపే స్థాయికి చేరిన తాటిపర్తి చంద్రశేఖర్‌కు ఎదురేలేదని పేర్కొన్నారు. ఉరవకొండ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మాట్లాడుతూ మీడియా వాయిస్ బలంతో పాటు జనబలం కలిగిన నేతగా తాటిపర్తి చంద్రశేఖర్‌కు రాజకీయంగా మంచి భవిష్యత్తు ఉందని, అధినేత జగన్‌కు మంచి ఆప్తుడిగా మారడంతో ఇక తిరుగే లేదని అన్నారు. జాతీయ స్థాయి ఎడ్లబలప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులు కందుకూరు నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్కాపురం, చుండూరి రవి ఒంగోలు ఇన్‌చార్జి, సింగారెడ్డి సతీష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వెన్నపూస రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు వరికూటి అశోక్‌బాబు, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి(వైఎస్సార్‌సీపీ స్టేట్ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు. మూడవ రోజు జరిగిన న్యూ కేటగిరి ఎద్దుల విభాగపు పోటీలలో 14 క్వింటాళ్ళ బరువు గల బండను నిర్ణీత సమయంలో లాగేందుకు 12 జతలు ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలలో గెలిచిన 9 జతలకు 9 బహుమతులు రూ.4,23000 నగదును 9 జతల విజేతలకు దుశ్శాలువాలతో సన్మానించి షీల్డుతో పాటు నగదును ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పార్టీ శ్రేణులతో కలిసి అందజేశారు.

## అంబరానంటిన ముందస్తు సంక్రాంతి సంబరాలు



**వలేటివారిపాలెం, జనవరి 13, ప్రభాతవార్త**
వలేటివారిపాలెం సెక్టార్-2లో సూపర్‌వైజర్ సునీత అధ్యక్షతన చుండి - 2 అంగన్‌వాడీ సెంటర్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో కే.ఉషారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగులోసంక్రాంతి పండుగ ప్రాముఖ్యత పంటలకోత, సూర్యారాధన, ప్రకృతికి కృతజ్ఞతలు, కుటుంబం అంత ఆనందంగా జరుపుకొనే పండుగ అని అన్నారు. సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు జరుపుకునే పండుగ అని చిన్నారులందరికి భోగి పళ్ల పోసి, భోగి మంటలు వేసి చిన్నారుల చేత కోలాటం, హరిదాసుల వేషధారణ, పిల్లల సాంప్రదాయక దుస్తుల వేషధారణ పండుగ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఉషారాణి, సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు రాజ్యలక్ష్మి, జ్యోతి, రాధ, అరుణ, గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే కఠిన చర్యలు

- జూద క్రీడలు వద్దు.. సంప్రదాయ క్రీడలు ముద్దు
- మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు - ఎస్సై మరిడి నాయుడు



**వలేటివారిపాలెం, జనవరి 13, ప్రభాతవార్త**
కోడి పందాలు, జూదాల వంటి అసాంఘిక కార్యకలాపాలను సహించేది లేదని, అలా పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై మరిడి నాయుడు హెచ్చరించారు. మండల ప్రజలందరికి ముందుగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు ఆయన తెలిపారు. సంక్రాంతి పండుగను సాంప్రదాయ పద్దతిలో కుటుంబ సభ్యుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల మీద నిరంతరం ప్రత్యేక టీమ్‌తో నిఘా ఉంచడమైందని ముందస్తు చర్యలో భాగంగా పాత నేరస్తులను కొంత మందిని బైండోవర్ చేసి వారిపై నిఘా ఉంచడమైందని, అసాంఘిక కార్యకలాపాల గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే వలేటివారిపాలెం పోలీసు వారికి డయల్ 110/112 ద్వారా తెలియపరచవచ్చునని, పండుగ సమయంలో మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎస్సై మరిడి నాయుడు తెలిపారు.

## మార్టూరు పంచాయతీ మాజీ సెక్రటరీ ప్రస్తుతం జొన్నతాళి



**మార్టూరు, జనవరి 13, ప్రభాతవార్త**
గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న జాగర్లమూడి సురేష్ స్థానిక అమ్మ ఆశ్రమానికి రూ.10,116 విరాళంగా అందజేశారు. సురేష్ పలుసార్లు వృద్ధులకు అన్నదానం జరిపిస్తూ మంగళవారం అమ్మ ఆశ్రమంపై అంతస్తు నిర్మాణానికి రూ.10,116లు సహాయంగా అందజేసి ఆశ్రమ అభివృద్ధికి తోడ్పడుతున్న సురేష్‌కి ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చంద్ ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన బత్తుల నాగార్జునరెడ్డి(ఎన్ఆర్ఐ)



**హనుమంతునిపాడు, జనవరి 13, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండలం వైసీపీ యువ నాయకులు బత్తుల నాగార్జునరెడ్డి(ఎన్ఆర్ఐ) కనిగిరి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సాంప్రదాయమైన పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఆనందంగా జరుపుకోవాలని తెలియజేశారు. ప్రతి తెలుగువారి ఇంట పాడి పంటలు, సిరి సంపదలతో నిండి ఉండాలని దేవుని కోరుకున్నట్లు తెలిపారు.

## మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

- టీడీపీ మండల యూనిట్ కన్వీనర్ దేవిరెడ్డి రాజారామిరెడ్డి



**హనుమంతునిపాడు, జనవరి 13, ప్రభాతవార్త**
మండల ప్రజలకు కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు టీడీపీ మండల యూనిట్ కన్వీనర్ దేవిరెడ్డి రాజారామిరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ప్రతి కుటుంబంలో సంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పంటలు సమృద్ధిగా పండి రైతుల ఇంట సిరులు కురవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

## అంబరాన్నంటిన ముందస్తు సంక్రాంతి సంబరాలు



**లింగసముద్రం, జనవరి 13, ప్రభాతవార్త**
లింగసముద్రం మండలం పెద్దపవని సెక్టార్ పరిధిలోని ముత్యాలపాడు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో మాధవిలతా ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ రాధదేవి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రాధదేవి మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం యొక్క విశిష్టత గురించి భోగి మంటలు, గంగిరెద్దు, హరిదాసులు, గాలి పటాలు సంక్రాంతి పండుగకి కొత్త పంటలు వచ్చి రైతులు ఆనందంగా జరుపుకునే విధానాలను వివరించారు. భోగి సంక్రాంతి కనుమ మూడు రోజులు జరుపుకునే ఈ పండుగ అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని సూచించారు. భోగి పళ్ళు పోసి భోగి మంటలు వేసి చిన్నారులచేత హరిదాసుల వేషధారణ, సంప్రదాయ దుస్తులు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, పిల్లలు పాల్గొన్నారు.

## చెత్త రహిత గ్రామ పంచాయతీలే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**లింగసముద్రం, జనవరి 13, ప్రభాతవార్త**
చెత్త రహిత గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు షేక్ రఫీ అన్నారు. పెద్దపవని గ్రామంలో ప్రతి ఇంటికి రెండు డస్ట్‌బిన్స్‌లను తడి చెత్త పొడి చెత్త వేసుకోవడానికి పంపిణీ చేశారు. గత రెండు నెలల క్రితం 1300 ఇళ్లకు డస్ట్ బిన్స్ పంపిణీ చేయగా, మిగిలిన 300 ఇళ్లకు మంగళవారం పంపిణీ చేశారు. డస్ట్‌బిన్లను ప్రజలు వినియోగించుకుని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# సీఎం సహాయనిది చెక్కుల పంపిణీ

- 55 మంది - రూ.59.05 లక్షలు



**కందుకూరు జనవరి 13ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి సహాయనిధి కింద కందుకూరు నియోజకవర్గంలో 975మందికి రూ7.8కోట్లు అందచేసినట్లు స్దానికఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో బాగంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 55మందికి రూ.59.05 లక్షల విలువైన చెక్కులను ఆయన లబ్దిదారులకు పంపిణీచేశారు. స్దానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధిక మొత్తంలో లబ్దిదారులను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞలన్నారు. గతంలో ఈ నిధులు అందక అనేకమంది తమ ఆరోగ్యాన్ని కోల్పోయారన్నారు. ప్రస్తుతం అర్హతలతో అడిగినవారికి కాదనకుండా ఆర్దిక సహాయం అందచేస్తున్నట్లు తెలిపారు. వలేటివారిపాలెం మండలం 21 మందికి రూ.17.08 లక్షలు, కందుకూరు మండలం 15మందికి రూ.25.19లక్షలు, కందుకూరు పట్టణంలో 19 మందికి రూ.16.77 లక్షలు చొప్పునఅందించారు. ఈ కార్యక్రమంలో వివిద మండలాల తెదేపాఅధ్యక్షులు దామా మల్లేశ్వర రావు, బుస్సా రెడ్డి కృష్ణారెడ్డి, టిడిపి అధ్యక్షులు మాదాలలక్ష్మినరసింహం, నాయకులు చదలవాడ కొండయ్య నియోజకవర్గ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలుపువ్వాడి మోనిక పాల్గొన్నారు.

## వేముల, వేములబండ గ్రామాల్లో పొలం పిలుస్తోంది



**ముండ్లమూరు, జనవరి 13, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలోని వేముల, వేములబండ గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణాధికారిణి వేమూరి కీర్తి మాట్లాడుతూ అలాగే రబీ 2025-26 పంటకాలంలో సాగు చేసిన పంటలను ఈ పంట ద్వారా నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు తిప్పాస్వామి, షేక్ మాసుమ్ బాజీ, బాల వెంకటయ్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతా నియమాలు పాటించాలి-ఆర్టీవో నాగలక్ష్మి

- పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహణ



**కందుకూరు జనవరి 13ప్రభాతవార్త**
వాహనదారులు, వాహనచోదకులంతా రహదారి భద్రతా నియమాలను పాటించాలని కందుకూరు ఆర్టీవో టీవి నాగలక్ష్మి సూచించారు. 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో బాగంగా మంగళవారం మార్కెట్ యార్డ్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జరిగినది. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనం నడుపువారు శిరస్త్రాణం, కారు నడుపువారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరి ఎంవిఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులే అదికశాతం ప్రమాదాలకు గురవడం, మృతిచెందడం జరుగుతుందనిఆనుభవపూర్వకంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు రూరల్ ఎస్సై సి హెచ్ రాము మాట్లాడుతూ పరిమితికి మించి వాహనం నడుపరాదన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడిపితే కలిగే అనర్దాలను వివరించారు. పరిమితికి మించిన వేగం వద్దన్నారు. సిగ్నల్ జంపింగ్ నివారించడం మరియు క్రమశిక్షణను నిర్వహించడం గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కందుకూరు రూరల్ ఎ.ఎస్ఐ కె శ్రీనివాసులు, రవాణా శాఖ ఏవో కె.శివ ప్రసాద్ మరియు రవాణాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

## ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు

- టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ముచ్చా రంగ సాయి యాదవ్



**హనుమంతునిపాడు, జనవరి 13, ప్రభాతవార్త**
తెలుగు ప్రజల అత్యంత సంప్రదాయ బద్దమైన భోగి, సంక్రాంతి పండుగలను ప్రతి ఒక్కరూ ఆనందోత్సహాలతో జరుపుకోవాలని టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి, ఉమ్మనపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు ముచ్చా రంగ సాయి యాదవ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గ ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాల భోగి పండుగ సంబరాలు పంచే సంక్రాంతి పండుగ. రైతులకు ఇష్టమైన కనుమ పండుగలను ప్రజలు సంస్కృతి, సంప్రదాయాల నడుమ వైభవంగా జరుపుకోవాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

## ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ కస్తాల బాలాజీ దంపతులు



**హనుమంతునిపాడు, జనవరి 13, ప్రభాతవార్త**
నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు కనిగిరి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ కస్తాల బాలాజీ, మండల మహిళా అధ్యక్షురాలు డాక్టర్ కస్తాల బేబి దంపతులు ఒక ప్రకటనలో మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# నరసింహ స్వామి క్షేత్రంలో సంక్రాంతి ఉత్సవాలు

- 14 నుంచి 16 వరకు ప్రత్యేక పూజలు
- కనుమ నాడు స్వామి వారి పుష్కరిణిలో తెప్పోత్సవం



**సింగరాయకొండ, జనవరి 13,ప్రభాతవార్త**
సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచినపాత సింగరాయకొండ లోని శ్రీ శ్రీ శ్రీ యోగానంద లక్ష్మీ నారసింహ స్వామి క్షేత్రం, శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీ నారసింహ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయశాఖ కార్య నిర్వహణ అధికారి పాతకోట కృష్ణవేణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా భోగి పండుగ సాయంత్రం ఆలయ ప్రాంగణంలో గోదాదేవి కళ్యాణ మహోత్సవం, సంక్రాంతి రోజున రాత్రి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కనుమ నాడు స్వామివారి పుష్కరిణిలో తెప్పోత్సవం, అనంతరం గ్రామోత్సవం, పార్వేట ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగనున్నాయని పేర్కొన్నారు. అలాగే నేడు దేవస్థానం ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3,000, ద్వితీయ బహుమతిగా రూ.2,000, తృతీయ బహుమతిగా రూ.1,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ అధికారులు కోరారు.

## గాలిపటం దారంతో పోస్టుమ్యాన్‌కు తీవ్రగాయాలు



**సింగరాయకొండ, జనవరి 13, ప్రభాతవార్త**
సంక్రాంతి పండుగ సందర్భంగా ఎగురవేసిన గాలిపటం దారం మెడకు చుట్టుకొని ఓ పోస్టుమ్యాన్ తీవ్రంగా గాయపడిన ఘటన సింగరాయకొండమండలకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. పట్టణంలోని న్యూ పోస్ట్ ఆఫీస్ వీధికి చెందిన రాపూరి గోపి సింగరాయకొండ పోస్టాఫీసులో పోస్టుమ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రోజువారీ విధుల్లో భాగంగా ఉత్తరాల పంపిణీ కోసం తహసీల్దార్ కార్యాలయం సమీపానికి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న సమయంలో గాలిపటంకి ఉపయోగించే మంజా దారం అకస్మాత్తుగా ఆయన మెడకు చుట్టుకుంది. దీంతో మెడకు తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈసందర్భంగా వైద్యులు, అధికారులు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో గాలిపటాలు ఎగరేసేటప్పుడు తల్లిదండ్రులపర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. రహదారులు, రద్దీ ప్రాంతాల్లో కాకుండా ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే గాలిపటాలు ఎగరవేయాలని తెలిపారు. నైలాన్, మంజా వంటి దారాల వల్ల ప్రాణాపాయ ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని కోరారు.

## తూర్పు గంగవరంలో సంక్రాంతి సంబరాలు

**తాళ్లూరు, జనవరి 13,ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నేటి నుంచి సంక్రాంతి సం బరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలోని పడమటి బజారు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, మహిళలు, చిన్నారులకు ప్రత్యేక ఆటల పోటీలు, యువతకు, పెద్దలకు ట్రాక్టర్ రివర్స్, స్లో బైక్ రేస్, పోటీలు నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం



**దొనకొండ,జనవరి 13,ప్రభాతవార్త**
దొనకొండ మండలంలోని పి.వెంకటాపురం మరియు ఇండ్లచేరువు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగిందిఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ1. రబి 202526లో సాగులో ఉన్న ప్రతి పంటను గ్రామ వ్యవసాయ సహాయకుల కు తెలిపి వెంటనే ఈ పంట నమోదు ప్రక్రియ లోనికి తీసుకొని రావాలని వ్యవసాయ, ఉద్యాన ,పట్టు పరిశ్రమ చెందిన పంటలు సామాజిక వనాలు, సోషల్ ఫారెస్ట్ అయిన సుభాబుల్, జామాయులను ఈ పంట నమోదు తప్పనిసరి నమోదు చేచాలని మరియు అని ప్రభుత్వం కల్పించే వ్యవసాయ పథకాలు, రాయితీలకు ఈ పంట నమోదు ప్రామాణికమని దీని వలన రైతులకు ఉప యోగాలు ఉన్నాయని తెలిపారు. 2. ఈ పంట చేయించు కోకపోతే పండిన పంటను మద్దతు ధర కి అమ్ముకోవాల్సినపుడు కూడా సమస్యలు వస్తాయని అలా జరగకుండా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గారు వి. బాలకృష్ణ నాయక్ గారు రైతులను కోరారు. 3. కంది పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు గురించి తెలియజేశారు. కందిలో కాయ ఈగ పురుగు నివారణకి ప్రొఫెనోఫాస్ 400 మీ.లీ లేదా థయాక్లోప్రిడ్ 100 మీ.లీలను ఎకరానికి పిచికారి చేయాలి. 4. కంది పంటను మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొదలచిన రైతులు మీ యొక్క గ్రామ వ్యవసాయ సహాయకులు దగ్గర రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపినారు. 5. గ్రామాలలో ఇంకా కొంతమంది రైతులు రైతు గుర్తింపు సంఖ్య (తిశిసీళి) తీసుకోవలసిన వారు వెంటనే మీ గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రైతు గుర్తింపు సంఖ్య తీసుకోవాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో బహులార్ధ ప్రయోజన విస్తరణ అధికారి విన్నీ బాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు రామాంజనేయులు ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో నూతన సంతోష క్రాంతులు నింపాలి

- జిల్లా ఇంచార్జ్ ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు



**మార్కాపురం, జనవరి 13, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా ప్రజలందరికీ జిల్లా ఇంచార్జ్ ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో నూతన ఆశలు, సంతోషక్రాంతులు నింపాలని ఆకాంక్షించారు. భోగి భోగభాగ్యాలను, సంక్రాంతి సుఖసంతోషాలను, కనుమ కమ్మని కనువిందులను ప్రజలందరూ ఆనందంగా అనుభవించాలని తెలిపారు. ఈ పండుగను తెలుగు సంస్కృతి, సంప్రదాయాల విలువలను ప్రతిబింబించే విధంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే జిల్లా పోలీస్ సిబ్బందికి కూడా ఎస్పీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల భద్రతే పరమావధిగా విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సంక్రాంతి పండుగ జిల్లా ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, సంతోషాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

## కొండపల్లి గ్రామపంచాయతీలో పారిశుధ్య పనుల పరిశీలన



**మార్కాపురం, జనవరి 13,ప్రభాతవార్త**
మార్కాపురం మండలం కొండపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ. బాల చెన్నయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమంలోభాగంగా గ్రామపంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలని, ముఖ్యంగా అన్ని ప్రార్థనా స్థలాల పరిసరాలలో శుభ్రతను తప్పనిసరిగా పాటించాలని పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం (ఎస్ డబ్ల్యూ పి సి) ను సందర్శించిన ఆయన, ఈ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ప్రతి ఇంటి నుండి వేరు చేసిన తడి చెత్తను ఎస్ డబ్ల్యూ పి సి కేంద్రానికి తరలించి, వర్మీ కంపోస్ట్ తయారీని క్రమబద్ధంగా చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారులు జి.స్వర్ణలత, ఎస్.కే. కాజా గరీబ్, పంచాయతీ అభివృద్ధి అధికారి కే. కళ్యాణి పాల్గొన్నారు.

## కొమరోలులో అన్నా క్యాంటిన్ ఏర్పాటు చెయ్యాలి

**కొమరోలు, జనవరి 13, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన కొమరోలులో అన్నా క్యాంటిన్ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కొమరోలు మండల వినియోగ దారుల సంఘ అధ్యక్షులు డాక్టర్ ఖాజావలి విజ్ఞప్తి చేశారు. కొమరోలు మండలంలో 74 గ్రామాలు ఉన్నాయని ఈ గ్రామాల నుండి ప్రజలు ప్రతి నిత్యం కొమరోలు కు పనులమీద వచ్చి పనులు పూర్తి చేసుకొని వెళ్తుంటారని కావున దూర ప్రాంతాలనుండి పనులపై వచ్చే పేదల ఆకలి తీర్చేందుకు వీలుగా కొమరోలులో అన్నా క్యాంటిన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రూ.5లకే భోజనం పెట్టి ఆకలి తీరుస్తున్న ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక రెడ్డికి గిద్దలూరు నియోజక వర్గ ప్రజలు రుణపడి ఉంటారని అందులో భాగంగా కొమరోలులో కూడా అన్నా క్యాంటిన్ ఏర్పాటు చేస్తే కొమరోలు మండల పేద ప్రజలకు సహకరించినట్లు ఉంటుందని ఆయన తెలిపారు.

# ప్రజలకు నేతల సంక్రాంతి శుభాకాంక్షలు





**కందుకూరు జనవరి 13 ప్రభాతవార్త**

కందుకూరు నియోజకవర్గప్రజలకు అధికార విపక్షనేతలు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు,మాజీ మంత్రి మానుగంట మహీధర్‌రెడ్డి, వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌లు వేరు వేరు ప్రకటనల్లో నియోజవర్గ ప్రజలంతా సంక్రాంతి సందర్భంగా సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు,బోగబాగ్యాలతో విరాజిల్లాలని ఆకాంక్షించారు. తెలుగు ప్రజల సంస్క ృతి సంప్రదాయాలకు సంక్రాంతి ప్రతీకని, సంక్రాంతికి ప్రతీ ఇల్లు ధాన్యపు రాశులతో కళకళలాడాలని, ఉషోదయాన్నే హరిదాసుల కీర్తనలు భం భం జంగమదేవరలు హాస్యాన్ని పండించే వేషధారణతో పగటివేషగాళ్ళు, డూ డూ బసవన్న అంటు గంగిరెద్దులవాళ్ళు మా ఇంటికి రండి అని ఆహ్వానించే గొబ్బెమ్మలు,గాలి పటాల రెపరెపలతో పల్లెలన్నీ కళకళలాడాలని కోరారు. నేటి సంక్రాంతి అందరి జీవితాలలో నూతనకాంతి నింపాలని ఆకాంక్షించారు.

# వాహన పార్కింగ్‌ను క్రమబద్ధీకరించండి



**కందుకూరు జనవరి 13 ప్రభాతవార్త**

కందుకూరు పట్టణం లోని వ్యాపారస్తులకు పోలీస్ వారి విజ్ఞప్తి:కందుకూరు సర్కిల్ పరిధిలోని ప్రజలకు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు.ఇందుమూలంగా కందుకూరు పట్టణంలో సంక్రాంతి సందర్భంగా ప్రజల రాకపోకలు గణనీయంగా పెరుగుతున్నాయి. సమీపగ్రామాల నుంచి ప్రజలు వివిద పనులతోపాటు షాపింగ్‌నిమిత్తం వాహనాలలో రాకపోకలు చేస్తున్నారు. ఈనేపద్యంలో పట్టణంలో ట్రాఫిక్‌కి ఆంతరాయం కలిగే అవకాశం మెండుగా ఉంది. కావున షాపుల ఎదుట వాహనాల పార్కింగ్‌ను ఆయా షాపుల యజమానులు క్రమబద్ధీకరించుకోవాలని సీఐ అన్వర్ బాషా విజ్ఞప్తిచేస్తున్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాహనదారులతోపాటు షాపుల యజమానులపై చట్టపర చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వివరించారు.ఇందుకు పోలీసులకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

# విశ్రాంత ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



**పొదిలి, జనవరి 13, ప్రభాతవార్త**

పొదిలి ఎస్టీఓ కార్యాలయం నందు మంగళవారం ఎస్‌టీఓ చంద్రశేఖర్, పొదిలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి మదార్ వలి, కోశాధికారి సీహెచ్‌వీ సుబ్బారావు, జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు కన్వీనర్ దాసరి గురుస్వామి 2026 నూతన సంవత్స ర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీవో చంద్రశేఖర్ రిటైర్డ్ ఉద్యోగులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పొదిలి తాలూకా కార్యదర్శి మదార్ వలి మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ గ్రాడ్యుటీ సెలవు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. గతంలో పదవీ విరమణ చేసిన రోజే గ్రాడ్యుటీ ప్రావిడెంట్ ఫండ్ కమ్యూనికేషన్ అందుకునే వారని ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడం చాలా దారుణమని ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పొదిలి సబ్ ట్రెజరీ ఆఫీస్ సిబ్బంది కరిముల్లా, విశ్రాంత ఉద్యోగులు సుబ్బారావు, మోహన్‌రావు, జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి కలెక్టర్ రాజాబాబును కలిసిన

### పొదిలి నూతన మున్సిపల్ కమీషనర్



**పొదిలి, జనవరి 13, ప్రభాతవార్త**

పొదిలి మున్సిపాలిటీ నూతన కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మారుతీరావు మార్కాపురం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ పి.రాజాబాబును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

# బస్ స్టేషన్‌ను వినియోగంలోకి తెస్తాం

**- ఆర్ఎం సత్యనారాయణ**



**బల్లికురవ, జనవరి 13, ప్రభాతవార్త**

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారి, అలంకార ప్రాయంగా మిగిలిన బస్ స్టేషన్‌ను వినియోగంలోకి తెస్తామని ఒంగోలు ఆర్ఎం సత్యనారాయణ అన్నారు మంగళవారం ఆయన బల్లికురవ బస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హోటల్ దుకాణాల వ్యర్థాలు, చికెన్ దుకాణాల వ్యర్థాలకు ఆవాసంగా మారి, ఆక్రమణలతో ఉనికి కోల్పోతున్న బస్ స్టేషన్‌ను పరిశీలించారు. బస్ స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు, ఆక్రమణలను కూడా తొలగించి అభివృద్ధి చేస్తామని సత్యనారాయణ తెలిపారు. బల్లికురవ నుండి వెళ్లే ప్రతి ఆర్టీసీ సర్వీస్ బస్ స్టేషన్‌లోకి వెళ్లి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట అద్దంకి టీఐటు వలి, సిబ్బంది ఉన్నారు.

# సచివాలయాలను పరిశీలించిన డీడీఓ సువార్త



**సంతనూతలపాడు, జనవరి 13, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని 1,2వ సచివాలయాలను మంగళవారం నాడు ఒంగోలు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి సీహెచ్ సువార్త పరిశీలించారు. ముఖ్యంగా సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయం సిబ్బందిని డీడీఓ సువార్త ఆదేశించారు. ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్ హాజరును నిర్దేశించిన టైంలో వేయాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బందికి డీడీవో సువార్త పలు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అరుణ్ కుమారి,పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు,సచివాలయం జూనియర్‌సహాయకులు వై.శిఖామణి,సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు వాహనదారులకు

# పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన



**సంతనూతలపాడు, జనవరి 13, ప్రభాతవార్త**

మద్దిపాడు మండలం గుళ్ళాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద మంగళవారం నాడు మద్దిపాడు ఎస్సై జి.వెంకట సూర్య, పోలీసు ఇసబ్బంది ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ప్రమాదాలు నివారణకు వాహనదారులకు ప్రత్యేకంగా అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ వాహనదారుడు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని తద్వారా ప్రమాదాల నుండి విముక్తి పొందవచ్చునని ఎస్సై వెంకట సూర్య వాహనదారులకు గులాబీ పుష్పం అందజేసి తెలియజేశారు. అదే విధంగా వాహనాలపై విపరీతంగా లగేజ్ పెట్టుకొని ఫ్యామిలీతో వెళ్లరాదన్నారు. తద్వారా ప్రమాదాలు చోటు చేసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కారులోనియజమాని, డ్రైవర్లు తప్పనిసిగా సీట్ బెల్టు పెట్టుకుని ప్రయాణించాలన్నారు. ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్టుల ఆవశ్యకతపై ఎస్సై వెంకట సూర్య వాహనదారులకు వివరించారు. హెల్మెట్ లేకుండా వాహనదారుడు ప్రయాణిస్తే తలకు తీవ్ర గాయం, ప్రాణ నష్టం కలగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరుతూ ఈ సందర్భంగా వాహనదారులచే ప్రతిజ్ఞ చేయించారు.

## ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసిన

# ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



**దర్శి, జనవరి 13, ప్రభాతవార్త**

దర్శిలోని పొదిలి రోడ్డులో గల హ్యాపీ హోమ్స్ నందు సంక్రాంతి ఆటల పోటీలు సందర్భంగా దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మల ఆధ్వర్యంలో మహిళలకు మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో మొదటి విడత కొల్లి సుజాతకి ఫ్రిజ్‌ని అందజేయడం జరిగింది. రెండో బహుమతి ఏం.ప్రత్యూషకి ఎల్ఈడీ టీవీని అందజేయడం జరిగింది. మూడో బహుమతి పేరమ్మ మనోజ్ఞకి వాషింగ్ మిషన్‌ని అందజేయడం జరిగింది. నాలుగో బహుమతి బి.స్వాతికి గ్రైండర్‌ని అందజేయడం జరిగింది. ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్స్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వెన్నపూస వెంకటరెడ్డి, సోము దుర్గారెడ్డి, ముత్తినీడి సాంబయ్య, చింత శ్రీనివాసులురెడ్డి, కేవీ రెడ్డి, బండి గోపాల్‌రెడ్డి, ఇత్తడి దేవదానం, మేడం మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, తుళ్లూరి బాబురావు, గాలి ముట్టి దేవప్రసాద్, కోళ్ల ఉదయ భాస్కర్, అన్నవరపు రవి, దుగ్గినేని రామకృష్ణ, పాణ్యం మజ్నువలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రొటోకాల్, విద్యుత్ దీపాలుపై రగడగా మారిన

# మద్దిపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**- సమావేశంలో సర్పంచ్‌లు, అధికారుల మధ్య చోటు చేసుకున్న ఛాలెంజ్‌లు**





**సంతనూతలపాడు(మద్దిపాడు), జనవరి 13, ప్రభాతవార్త**

గ్రామాల్లో ప్రొటోకాల్ విద్యుత్ దీపాలకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారుల మధ్య మంగళవారం నాడు జరిగిన మద్దిపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రగడగా మారింది. మద్దిపాడు ఎంపీపీవి.అరుణ కోటిరెడ్డిఈ సమావేశానికి అధ్యక్షత వహించగా ఎంపీడీవో వి.జ్యోతి దీనిని పర్యవేక్షించారు. ముఖ్యంగా మండలంలో గ్రామ పంచాయతీలోజరిగే అభివృద్ధి పనులు శంకుస్థాపన, ప్రారంభోత్స వాల కార్యక్రమాల్లో ప్రజలచే ఎన్ను కోబడిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఆహ్వానించ కుండా ఇష్టానుసారంగాగ్రామ పంచాయతీల అభివృద్ధి అధికారులు, మండల అధికారులు వ్యవహారిస్తున్నారని సర్పంచ్‌లు బెజవాడ రాము, పూనాటి సుబ్బారావు, నారా సుబ్బారెడ్డి, రామాంజనేయులు తదితరులు ధ్వజమెత్తారు. గ్రామ పంచాయతీలో జరిగే కార్యక్రమాల్లో సర్పంచ్‌లను పిలవకుండా ఇష్టానుసారంగా చేయడంపై పలువురు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్ దీపాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు వాడకుండా మండల స్థాయి అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు తరచూ అడ్డు వస్తున్నారని, దీని వలన గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని దొడ్డవరప్పాడు సర్పంచ్ బెజవాడ రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారుల మధ్య నువ్వెంత, నువ్వెంత ఛాలెంజులు చేసుకున్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు ముఖ్యంగా గ్రామ పంచాయతీఅభివృద్ధికి సహకరించడం లేదని ఆయన ధ్వజమెత్తారు. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారుల మధ్య ఈ సమావేశంలో రగడ, ఛాలెంజ్‌లు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబు, పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ రవిబాబు తదితరులతో సర్పంచ్‌లు రాము, సుబ్బారావు, సుబ్బారెడ్డి తదితరులు మధ్య వాగ్వాదం, రగడ చోటు చేసుకుంది. గ్రామాల్లో ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని మద్దిపాడు ఎంపీపీ వి.అరుణ కోటిరెడ్డి ఈ సందర్భంగా కోరారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, మండల స్థాయి అధికారులు ఐక్యమత్యంగా పాటుపడాలని ఎంపీపీ అరుణ తన ప్రసంగంలో కోరారు. ప్రొటోకాల్ పాటించని వారిపై చర్యలకు ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు ఎంపీపీ అరుణ కోటిరెడ్డి తన ప్రసంగంలో పేర్కొన్నారు. సమావేశంలో ఆయా రంగాల అభ్యున్నతి కన్నా రగడ, ఛాలెంజ్‌లతోనే కార్యక్రమం ముగిసింది. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు పైడి వెంకటరావు, ఎం.విజయలక్ష్మిలు, మండల పరిషత్ ఏవో డిఎస్‌వీ ప్రసాద్, ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, డిప్యూటీ ఎంపీడీవోలు, కొండపి రఘుబాబు, బి.హరిప్రసాద్, మండల వ్యవసాయాధికారిణి స్వర్ణలత, పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ పి.రవిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, వైద్యులు శ్రావణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాబు, సర్పంచ్‌లు బొమ్మల రామాంజనేయులు, శివానంగరావు, రాము, సుబ్బారావు, సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, కోటిరెడ్డి, ప్రభాకర్, పద్మ, దేవదాసు, మేరుగ పద్మ, సొఐటీ అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కోడి పందాలు, జూదం ఆడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం




**చీరాల, జనవరి 13 ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ సందర్భంగా చిన్నగంజాం పోలీసు స్టేషన్ పరిధిలో జూదం, కోడి పందాలు, గుండాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని చిన్నగంజాం పోలీసు స్టేషన్ ఎస్సై ఎస్.రమేష్ హెచ్చరించారు. కోడి పందేలు, జూదం జరిగే అవకాశమున్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేసి దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జూదం, కోడిపందాలు, అక్రమ మద్యం విక్రయాలు, మద్యం సేవించి వాహనాలు నడపటం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. చిన్నగంజాం పోలీసు స్టేషన్ పరిధిలో జూదం, కోడి పందాలు పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. కోడి పందేల నిర్వహణకు స్థలాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా జూదం లేదా కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే 9121102149 నంబర్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

## బీబీహెచ్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు



**వేటపాలెం, జనవరి 13, ప్రభాతవార్త**

వేటపాలెం మండల కేంద్రంలో బీబీహెచ్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మెన్ డబుల్స్ షటిల్ టోర్నమెంట్ మంగళవారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను నిరంజన్ సుబ్బనాగయ్య, మోహన్‌రావులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని, యువత క్రీడల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ టోర్నమెంట్‌కు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం అరవై టీంలు పాల్గొనడం విశేషం. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.15,116, రెండో బహుమతి రూ.12,116, మూడో బహుమతి రూ.10,116, నాలుగో బహుమతి రూ.7,116 నగదు బహుమతులు ప్రకటించారు. అదే విధంగా ఇతర కేటగిరిల్లోనూ బహుమతులు ఏర్పాటు చేశారు. 45 ఏళ్ల పైబడిన ఆటగాళ్లకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆటగాళ్లను ఉత్సాహపరిచే క్రమంలో టోర్నమెంట్ విజయవంతంగా సాగింది.

## రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో బాపట్ల జిల్లా బాలుర, బాలికలు ప్రధమ స్థానం



**చీరాల, జనవరి 13, ప్రభాతవార్త**

ఈనెల 9,10,11వ తేదీల్లో మార్టూరులోని శ్రీవివేకానంద నెక్స్ జెన్ ఇంగ్లీష్‌స్కూల్ నందు రాష్ట్ర స్థాయి అండర్-19 బాల బాలికల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రం నుండి 13 జిల్లాలు పాల్గొనగా బాపట్ల జిల్లా బాలురు అనకాపల్లి జిల్లాపై 2-1 తేడాతో ప్రధమ స్థానాన్ని సాధించారు. అలాగే బాలికల విభాగంలో బాపట్ల జిల్లా అనకాపల్లి జిల్లాపై 2-0 తేడాతో ప్రధమ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా చీరాలలోని ప్రేమ హార్ట్ హాస్పిటల్ ఎండీ బాపట్ల జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఇస్తర్ల బాబురావు గెలుపొందిన బాల బాలికలను అభినందించారు. క్రీడలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసానికి ఎంతో అవసరమని తెలియజేశారు. గెలుపు ఓటమిలు సహజమని ప్రతి ఒక్క క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్ర, బాలుర, బాలికల కోచ్ తుమ్మ శ్రీనివాసరెడ్డి, మురళిరెడ్డి, బొనిగల యశోద కృష్ణ, పీఈటీలు కే.రాణి, టి.ఈశ్వరి, పేరెంట్స్ పాల్గొన్నారు.

## రైతు బాగుంటే రాజ్యం బాగుంటుందని నమ్మిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**



**దర్శి, జనవరి 13, ప్రభాతవార్త**

మన కూటమి ప్రభుత్వంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు కడియాల లలిత్‌సాగర్‌లు పొలం బాట పట్టి కంది పంటను పరిశీలించారు. శంకరాపురం- మారెళ్ళ మార్గమధ్యలో మంగళవారం కంది సాగును వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. కంది సాగు తెగుళ్ల తదితర అంశాలపై రైతులతో మాట్లాడి తీసుకోవాల్సి న జాగ్రత్తలను అధికారులతో మాట్లాడారు. మన కూటమి ప్రభుత్వంలో రైతుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా దృష్టి సారించడం జరిగిందని, సకాలంలో ఎరువులు, సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడం, ఉద్యానవన పంటలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం, జరుగుతుందని డాక్టర్ లక్ష్మీ వివరించారు. వారితో పాటు స్థానిక నాయకులు ఉన్నారు.

## డాక్టర్ లక్ష్మీ సొంత నిధులతో నీటి సమస్య పరిష్కారానికి ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్మాణం

**- ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**



**ముండ్లమూరు, జనవరి 13, ప్రభాతవార్త**

ముండ్లమూరు మండలం మారెళ్ల పంచాయతీలోని గంగపాలెం గ్రామంలో మంగళవారం దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ వారి సొంత నిదులతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ని ప్రారంభించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్. ఈ కార్యక్రమంలో ముండ్లమూరు మండల టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, మాజీ మండల పార్టీ అధ్యక్షులు సోమేపల్లి శ్రీను,మండలమాజీ ఎంపీపీ మందలపు వెంకట రామయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ రాఘవరెడ్డి, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# 91 మంది లబ్ధిదారులకు రూ. 59.52 లక్షల చెక్కులు

## పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్



**జె.పంగులూరు, జనవరి 13, ప్రభాతవార్త**

అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ కూటమి ప్రభుత్వంలో అన్నివేళలా చేయూత అందిస్తు అండగా ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలలో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు కులం,మతం, పార్టీ బేధాలు లేకుండా 91 మంది లబ్ధిదారులకు రూపాయలు 59. 52 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశామన్నారు.పేదలకు సంక్షేమాన్ని అందించడంలో దేశానికే రోల్ మోడల్‌గా ఏ.పీ.లో సీ.ఎం. చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అభివృద్ధి లో భాగంగా అమరావతి రాజధానినీ నిర్మించుకుంటున్నామన్నారు. రాజధాని అమరావతి, రాష్ట్ర అభివృద్ధిపై వైసీపీ నేతల విమర్శలను ప్రజలూ తిప్పి కొట్టాలన్న మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావు రమేష్ బాబు, మాజీ జెడ్పీటిసి సభ్యులు కరి. వెంకట సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కుక్క పల్లి పద్మా ఏడుకొండలు, తెలుగుదేశం పార్టీ నాయకులు చింతల సహదేవుడు, బురెడ్డి ఓబుల్‌రెడ్డి, జాగర్లమూడి వారి పాలెం సొసైటీ అధ్యక్షులు అల్లమనేని బ్రహ్మానంద స్వామి, కోటపాడు సొసైటీ అధ్యక్షులు రావుల సింగరకొండ, కొండమంజులూరు సొసైటీ అధ్యక్షులు బత్తుల వెంకట్రావు, పిచ్చిరెడ్డి, వలి, బాజీని చౌదరి బాబు, బాజిని త్రివేంద్రం, రేణింగవరం ఎస్సై బి. వినోద్ బాబు, తెలుగుదేశం పార్టీ మరియు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# మినీస్టేడియంలో వైభవంగా సంక్రాంతి సంబరాలు





**ఒంగోలు - ప్రభాతవార్త**

ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ఆధ్వర్యం లో డిజెఆర్ ట్రస్ట్ సహకారంతో సంక్రాతి సంబరాలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మంగళవారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. మిని స్టేడియం నందు నిర్వహించిన ముగ్గులు పోటీలలో సుమారుగా 318 మంది పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ కుటుంబ సమేతంగా మొదటి బహుమతిగా వెండి పళ్లెం, ద్వితీయ బహుమతిగా సింగిల్ డోర్ ఫ్రిడ్జ్, తృతీయ బహుమతిగా టీవీ బహుమతులు అందజశారు. అనంతరం వచ్చిన వారందరకి పండ్ల మొక్కలు ఉచితంగా శాసనసభ్యులు జనార్ధన్ పంపిణీ చేశారు.

# వైభవంగా తిరుమంజన సేవ..

**- స్వామి వారికి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మాజీ మంత్రి శిద్దా దంపతులు**




**చీమకుర్తి , జనవరి 13, ప్రభాతవార్త**

చీమకుర్తి కాండూరి వారి అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో ధనుర్మాస మహోత్సవ తిరుమంజనం సేవ మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అగ్రహారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో డిసెంబర్ 16 నుండి ఈ నెల 15 వ తేదీ వరకు నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవ శ్రీ గోదాదేవి తిరుప్పావై వ్రత మహోత్సహం సందర్భంగా మంగళవారం స్వామి వారికి కైంకర్య పోషకులు మాజీమంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మీ పద్మావతి దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో స్వామి వారికి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్థపన తిరుమంజన సేవ, ప్రత్యేక పూల అలంకారాలు,శ్రీ గోదాదేవి వ్రత మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు, వంశపారంపర్య ధర్మ కర్తలు కాండురి రవి రామానుజాచార్యులు మరియు స్థానా చార్యులు శ్రీమాన్ రామానుజాచార్యులు, అర్చక స్వాములు శిద్దా రాఘవరావు దంపతులను పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. శిద్దా రాఘవరావు దంపతులు ఆలయంలో వెంచేసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరా చార్యులు,ప్రవచన కర్త పంచాంగం రామానుజా చార్యులు,శ్రీ పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారికి విశేష పూజలు, విష్వక్షేణ ఆరాధన,తోమాల సేవ,సహస్ర నామార్చన, తిరుప్పావై సేవా కాలం,పాశురం సమర్పణ శిద్దా రాఘవరావు దంపతులు అత్యంత అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం వేద పండితులు శిద్దా రాఘవరావు దంపతులకు వేద ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు, స్వామి వారి శేష వస్త్రాలు అందచేసారు. ఆలయ జీర్ణోద్ధరణ ప్రధాన కైంకర్య పోషకులు శిద్దా హైమవతి శిద్దా వెంకటేశ్వర్లు వారి సతీమణి సూర్య కుమారి శిద్దా హనుమంతరావు, దంపతులు, శిద్దా సూర్య ప్రకాశరావు దంపతులు ఆధ్వర్యంలో ధనుర్మాసం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ జీర్ణో ద్ధరణ శాశ్వత కైంకర్య పోషకులు శిద్దా హనుమంతరావు దంపతులు శిద్దా రాఘవ రావు దంపతులు ,శిద్దా సుధీర్ కుమార్‌కు నూతన వస్త్రాలు అందచేశారు.ఆలయ అర్చకులు భక్తులకు తీర్థసాదాలు అందించారు.


## ప్రతి కుటుంబానికి 25లక్షల ఆరోగ్య భీమా సౌకర్యం అమలు : మంత్రి స్వామి




**కొండపి, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నుండి ప్రతి కుటుంబానికి 25 లక్షలు ఆరోగ్య బీమా పథకాన్ని, వర్తింప చేయనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు మంగళవారం రాష్ట్ర మార్టెం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆధ్వర్యంలో కొండపిలో మీట్ విత్ గ్రేట్ పేరుతో ఏర్పాటు చేసిన టిడిపి నియోజకవర్గస్థాయి విస్తృత స్థాయిసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.రాష్ట్రంలో ప్రజలు ఆరోగ్య విషయంలో ఇబ్బంది పడకూడదు అన్న ధ్యేయంతో ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పథకంతో పాటు ఆరోగ్య భీమాను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారని ఆయన అన్నారు స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం ప్రతి గ్రామానికి అభివృద్ధిలో ఫలాలు అందచేయ నున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో మిగిలి పోయిన ఉపాధ్యాయ పోస్టులతో పాటు బ్యాక్లాగ్ పోస్టులు కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక సంస్కరణలతో పార్టీ బలోపేతానికి లోకేష్ కృషి రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి రాష్ట్ర మంత్రివర్యులు యువ నాయకులైన నారా లోకేష్ పలు సంస్కరణలు చేపట్టినట్లు రాష్ట్ర మార్టం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. కొండపి నియోజకవర్గం నుండి పార్టీ పోలిట్ బ్యూరో లోకి ఇద్దరు మండల పార్టీ అధ్యక్షులను తీసుకోవడానికి పార్టీ అవకాశం కల్పించిందని అన్నారు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో టిడిపి పార్టీ సొంతం చేసుకోవాలని సూచించారు. పార్టీ కార్యకర్తలను నాయకులను ప్రభుత్వ కార్యాలయంలో అధికారులు గౌరవించి పనులు చేయాలని ఆయన గట్టిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు కనిగిరి ఎమ్మెల్యే ముక్కు నరసింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు వరిపాటి రామయ్య చౌదరి నియోజకవర్గంలోని కార్యకర్తలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**రాచర్ల, జనవరి 13 ప్రభాతవార్త**

మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. రాచర్ల 3వ, పలుగుంటిపల్లి కేంద్రాల్లో సూపర్వైజర్ వసంతకుమారి పాల్గొని సంప్రదాయ వంటకాలు,ముగ్గులు,హరిదాసు వేషాలు,గాలిపటాల ఎగుర వేసే తీరు, పంటలు, పశువులు, మొదలైన విషయాల గురించి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు. ఆయాలు. చిన్నారుల తల్లులు. తదితరులు పాల్గొన్నారు.

8_8.qxd 1/14/2026 12:42 AM Page 1



## కనిగిరి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు - మూలే బాలిరెడ్డి



**కనిగిరి, జనవరి 13, ప్రభాతవార్త**

కనిగిరి మండలంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మూలే బాలిరెడ్డి కనిగిరి నియోజకవర్గ ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కనిగిరి ప్రజలు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెడుతున్న ప్రజాకర్షక కార్యక్రమాలు ఫలితాలిస్తున్నాయని పేర్కొన్నారు. కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి కూడా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంలో వేగంగా అవులతోందని తెలిపారు. ప్రజలందరూ అభివృద్ధి కూటమికి అండగా నిలవాలని, ప్రతి కుటుంబం ఆనందంగా, అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని టీడీపీ నాయకులు మూలే బాలిరెడ్డి కోరారు.

## ఈఈ మెరిట్ టెస్టులో జిల్లా టాప్

### - పీఎంఎస్ శ్రీ విద్యార్థిని వనమా రుచితశ్రీ మెరిసింది



**కనిగిరి, జనవరి 13, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని పీఎంఎస్‌శ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని వనమా రుచితశ్రీ ఈఈ మెరిట్ టెస్టుల మెయిన్స్‌లో జిల్లా ప్రథమ స్థానం సాధించి మరో సారి ప్రతిభను నిరూపించింది. ఒంగోలు కేంద్రంగా గత నెలలో నిర్వహించిన పరీక్షలో ఆమె అత్యుత్తమ ప్రదర్శన కనపరిచినట్లు పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. విజేతలకు ఫిబ్రవరి 1వ తేదీన విజయవాడ గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నగదు బహుమతి, జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా భౌతికశాస్త్ర శాఖ ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలోక్ష్మ విద్యార్థిని వనమా రుచితశ్రీను జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు అభినందించారు. విద్యార్థిని రుచితశ్రీ విజయం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.

## ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు

### - మాజీ ఎమ్మెల్యే కదిరి



**కనిగిరి, జనవరి 13, ప్రభాతవార్త**

తెలుగు సంప్రదాయాలలో భాగంగా వస్తున్న సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన కాంతిని తీసుకురాగలదని కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అన్నారు.పాడి పంటలకు ఎటువంటి లోటు లేకుండా సస్యశ్యామలంగా రైతులందరూ సుభిక్షంగా ఉంటూ మరెన్నో ఇలాంటి ఆనందోత్సవాలను జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కనిగిరి నియోజకవర్గం ప్రజలకు మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. భోగి భోగ భాగ్యాలను సంక్రాంతి సుఖ సంతోషాలను కనుమ కమణీయమైన అనుభూతులను అందించాలని అవి మీ జీవితాల్లో వెల్లి విరియాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ పండుగను మీ కుటుంబ సభ్యులతో ఆనందోత్సవాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన షేక్ షంషూర్



**పామూరు, జనవరి 13, ప్రభాతవార్త**

పామూరు మండల ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖ పారిశ్రామికవేత్త షేక్ షంషూర్ పామూరు మండలంలోని ప్రజలు తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే సంక్రాంతి వేడుకను అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. ప్రతి ఇంట భోగభాగ్యాలు కలగాలని పాడి పంటలు, అభివృద్ధి చెందాలని అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో, ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లి విరియాలని ఆయన ఆకాంక్షించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను అందరూ కుటుంబ సమేతంగా ఆనందోత్సాహాలతో సంతోషంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త షేక్ షంషూర్ కోరారు.

## అందరి కుటుంబాలలో వెలుగు నిండాలి

### - బొల్లా నరసింహారావు దంపతులు



**పామూరు, జనవరి 13, ప్రభాతవార్త**

పామూరు మండల ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేసిన పామూరు మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు దంపతులు. ప్రతి ఇంట ఈ భోగి మీకు భోగభాగ్యాలను, సంక్రాంతి మీకు సుఖ సంతోషాలు, కనుమ కమనీయమైన అనుభూతులను అందించాలని అందరి కుటుంబాలలో జీవితాంతం వెల్లివిరియాలని కోరుకుంటూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపిన ఆకుపాటి వెంకటేష్



**పామూరు, జనవరి 13, ప్రభాతవార్త**

పామూరు మండల ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్. ఈ భోగి రోజున పాత బాధలు కష్టాలు భోగి మంటల్లో దహనమై కొత్త ఆశలు కొత్త వెలుగులు మీ జీవితంలో వెలగాలని పంటలతో సిరి సంపదలతో ఆనందంతో నిండిన హృదయాలు సుఖ సంతోషాలతో నిండిన జీవితం మీ ఇంటి ముందు అడుగు పెట్టాలని, రైతు శ్రమకు గౌరవం ప్రకృతి, కృతజ్ఞత, పశుసంపద, అభివృద్ధి మీ కుటుంబానికి కలగాలని ఆయన మన సారా కోరుకుంటూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన గంగసాని హుస్సేన్‌రెడ్డి



**పామూరు, జనవరి 13, ప్రభాతవార్త**

పామూరు మండల ప్రజలందరికి భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగసాని హుస్సేన్‌రెడ్డి. ఈ భోగి రోజున పాత బాధలను దు:ఖాలను అగ్నికి ఆహుతి చేసి కొత్త ఆశలకు స్వాగతం పలికే రోజు. సంక్రాంతి సూర్యునికి పంటల ఆనందాన్ని పంచుకునే మహా పర్వదినం. కనుమ ప్రకృతితో పశుసంపదతో మన అనుబంధాన్ని గుర్తు చేసే విశిష్ట పండుగ. ఈ పండుగల వెలుగులో ప్రతి ఇంట్లో ఆనందం వెలగాలని ప్రతి హృదయంలో శాంతి, ప్రేమ, సమృద్ధి పరవళ్ళు తొక్కాలని మీ జీవితాల్లో ఆరోగ్యం ఐశ్వర్యం సుఖ సంతోషాలు నిత్యం నిలవాలని ఆకాంక్షిస్తూ మండల ప్రజలకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు ప్రజలందరికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగసాని హుస్సేన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజలందరూ సుఖసంతోషాలతో గడపాలి

### - రజియా సయ్యద్



**పామూరు, జనవరి 13, ప్రభాతవార్త**

భోగి, సంక్రాంతి, కనుమ ఇది కేలం పండుగలు మాత్రమే కాదు.. మన సంస్కృతి, సంప్రదాయం, కృతజ్ఞతాభావం, కుటుంబ ఐక్యతను గుర్తు చేసే పవిత్ర సందర్భాలు. భోగి పాత బాధలను, దు:ఖాలను అగ్నికి ఆహుతి చేసి, కొత్త ఆశలకు స్వాగతం పలికే రోజు. సంక్రాంతి సూర్యునికి కృతజ్ఞతతో పంటల ఆనందాన్ని పంచుకునే మహా పర్వదినం. కనుమ ప్రకృతితో, పశు సంపదతో మన అనుబంధాన్ని గుర్తు చేసే విశిష్ట పండుగ. ఈ పండుగల వెలుగుతో ప్రతి ఇంట్లో ఆనందం, వెలగాలి, ప్రతి హృదయంలో శాంతి, ప్రేమ, సమృద్ధి పరవళ్ళు తొక్కాలి. మీ జీవితాల్లో ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు నిత్యం నిలవాలని ఆకాంక్షిస్తూ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలను తెలుగుదేశం పార్టీ మహిళా నేత రజియా సయ్యద్ తెలియజేశారు.

## మంత్రి పరామర్శ



**కొరిసపాడు , జనవరి 13, ప్రభాతవార్త**

మండలంలోని మాలెంపాటి వారిపాలెం లో రాజయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వారి ఇంటికి వెళ్లి రాజయ్య ను పరామర్శించి, ఆరోగ్య విషయమై వాకబు చేశారు.

## మండల కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు



**సంతమాగులూరు, జనవరి 13, ప్రభాతవార్త**

మండల పరిషత్ కార్యాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముందస్తుగా మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో జ్యోతిర్మయి ఆధ్వర్యంలో సంక్రాతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతమాగులూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ రమేష్ భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు పండుగని ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించుకోవాలని రమేష్ అన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు విజయవంతంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిర్మయి, ఈఓపిఆర్డి ప్రసాదు, ఏపీవో నాయక్,ఏపీఎం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికోసం 24గం॥ల పనిచేస్తున్నా

### - ఇప్పటికే 300 కోట్లకి పైగా వెచ్చించాం - ఎమ్మెల్యే



**కందుకూరు జనవరి 13 ప్రభాతవార్త**

కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం 24 గంటలు పని చేస్తున్నానని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 300 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు.90 శాతం రోడ్లుకు మరమ్మతులు చేపట్టానట్లు తెలిపారు. నియోజకవర్గంలో పేదల ఆరోగ్యం కోసం ఇప్పటివరకు 975 మందికి 7.8 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించామని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి హామీ మేరకు మున్సిపాలిటీకి ఇప్పటికే 20కోట్లు నిధులు విడుదలైనట్లు తెలిపారు. తాజాగా మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కందుకూరు పర్యటనకు నేపద్యంలో మరో రూ.5 కోట్ల మంజూరు చేశారన్నారు. గతంలో సంబవించిన మొంతా తుఫానుతో నష్టపోయిన పంటచెరువల మరమ్మతులకు రూ.9 కోట్లు,రాళ్లపాడు రిజర్వాయర్ పైన కొత్తగాతారు రోడ్డు నిర్మాణం,ఇతర పనుల కోసం రూ.1.06 కోట్లు మంజూరయ్యా యని చెప్పారు. అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,యువ నాయకులు నారాలోకేష్, ఆయాశాఖల మంత్రులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం సూచనలు సలహాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు,బుస్సా రెడ్డి కృష్ణారెడ్డి,మాదాల లక్ష్మినరసింహం,పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య,నియోజకవర్గ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మోనిక పాల్గొన్నారు.

## భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపిన దారపనేని



**పామూరు, జనవరి 13, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి, తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు వారి కుటుంబ సభ్యులకు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. భోగి పండుగ నాడు దక్షిణాయణంలో తాము ఎదుర్కొన్న కష్టాలు, బాధలను భోగి మంటల రూపంలో అగ్ని దేవుడికి సమర్పించి రాబోయే ఉత్తరాయణంలో భోగి మంటల వెలుగులలో భోగభాగ్యాలను ప్రసాదించమని ప్రజలు ప్రార్థిస్తారని దారపనేని పేర్కొన్నారు. తెలుగువారు పెద్ద పండుగ అని ముద్దుగా పిలుచుకునే సంక్రాంతి పండుగ రోజున సూర్యుడు మకర రాశి నందు ప్రవేశిస్తాడు. మకర సంక్రమణం జరిగినందుకు మకర సంక్రాంతి అని పిలుస్తారని, ఇండ్ల ముందు రంగు రంగు ముగ్గులతో, గొబ్బెమ్మలతో స్వాగతం పలుకుతూ హరిదాసు హరినామ కీర్తనలతో ప్రజలను భక్తి మార్గంలోకి మరలుస్తారని దారపనేని చంద్రశేఖర్ తెలిపారు. కనుమ పండుగ రోజున పంటలు చేతికి అందడంతో తమకు సహాయపడిన పశుపక్షాదులను పూజిస్తారని, కనుమ రోజు రథము ముగ్గులను సూర్యగమనానికి సంకేతంగా వేస్తారని, పెద్దలకు, పోతురాజులకు మొక్కులు జాతరలు చెల్లించి కమ్మని కనుమును ప్రజలందరూ కుటుంబ సమేతంగా సంతోషంగా జరుపుకోవాలని దారపనేని ఆకాంక్షించారు.

## వస్త్ర దుకాణాలు వెలవెల

### - సంక్రాంతి పండుగ దినాన కానరాని సందడి

### - ఫుట్‌పాత్ వ్యాపారదే అదే పరిస్థితి - కనీస స్థాయిలో బేరాలు లేకపోవడంతో డీలా

### - ఉచిత బస్సుతో పాటు ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్రభావం అంటున్న వ్యాపారులు

**ఒంగోలు, ప్రభాతవార్త**

వస్త్ర దుకాణాల్లో ఏటా సంక్రాంతి పండుగకు ముందు కొనుగోలు దారులతో జోరుగా కనిపించే సందడి ఈ సారి పండుగకు పెద్దగా కనిపించడం లేదు. గ్రామీణ ప్రాతాల్లో సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందు నుంచే కళకళలాడే బట్టల షాపులు ఈ ఏడాది ఆశించిన స్థాయిలో అమ్మకాలు లేక కళ తప్పాయి. ఇటువంటి పరిస్థితిని గతంలో ఎన్నడు చూడలేదని వ్యాపారులు అంటున్నారు. వాస్తవానికి జిల్లాలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒంగోలు, చీరాల, కనిగిరి, అద్దంకి, కందుకూరు, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం వస్త్రవ్యాపారం అధికంగా జరుగుతూ ఉంటుంది. ఒక మోస్తారు షోరూమ్‌లతో పాటు చిన్నపాటి దుకణాలు సైతం సంక్రాంతి పండుగకు వారం పది రోజుల ముందు నుంచే రద్దీగా ఉంటాయి. అయితే ఈసారి అలాంటి పరిస్థితి లేదు. అవసరమైన రెడీమేడ్ దుస్తులు, చీరలు, డ్రస్ మెటీరియల్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. దీంతో ఆయా వస్త్ర దుకాణాలు కొనుగోలు దారులతో సంక్రాంతి ముందు కిటకిటలాడుతుంటాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఒకటి రెండు నియోజకవర్గాల్లో మినహాయిస్తే మిగిలిన నియోజకవర్గాల్లో, మండల కేంద్రాల్లో కూడా షాపుల కొనుగోలు దారులు లేక వెళవెళబోతున్నాయి. సంక్రాంతి పండుగ సమయంలో దుకాణ దారులు ఎంత వ్యాపారం చేస్తారోఇంచుమించు అంతే స్థాయిలో రోడ్డు పక్కన ఫుట్‌పాత్ వ్యాపారులు కూడా వ్యాపారం సాగిస్తుంటారు. పేదలు, దిగువ మధ్య తరగతి వారు అధికంగా ఫుట్‌పాత్ షాపుల్లో కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తుంటారు. దీంతో పెద్ద షాపుల మాదిరిగానే ఫుట్‌పాత్ దుకాణాలు కూడా కొనుగోలు దారులతో రద్దీగా ఉంటాయి. కానీ ఈసారి రోడ్డు పక్కన దుకాణాల వ్యాపారం కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఆన్‌లైన్ వ్యాపారంతో పాటు గ్రామాల్లో సైతం వస్త్ర దుకాణాలు ఏర్పాటు కావడంతో పట్టణ ప్రాంతాల్లో వ్యాపారం తగ్గిపోయిందని వారు వాపోతున్నారు. సంక్రాంతి సీజన్‌లో రోజుకు లక్ష రూపాయలకు పైగా వ్యాపారం జరిగే దుకాణాల్లో ప్రస్తుతం రూ.25వేలు కూడా ఉండడం లేదని అంటున్నారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగకు గ్రామీణ ప్రాంతాల వస్త్రాల వ్యాపారం భాగా తగ్గిపోవడానికి మహిళ ఉచిత బస్సు ప్రయాణం కూడా ఒక కారణమని చెప్తున్నారు. మహిళల్లో అత్యధికులు సంక్రాంతి షాపింగ్ కోసం ఇతర జిల్లాలతో పాటు ఒంగోలుకు వెళ్తున్నారు. ఇరుగుపొరుగు కుటుంబ సభ్యులు, స్నేహితులు ఇలా ఐదు నుంచి పది మంది కలిసి ఉదయానే బస్సుల్లో బయలుదేరుతున్నారు. కుటుంబం అంతటికి షాపింగ్ చేసుకుని సాయంత్రానికి ఇళ్లు చేరుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో తమ వ్యాపారం 30 నుంచి 40 వాతం తగ్గినట్లు వ్యాపారులు చెప్తున్నారు. గత ఏడాది దసరా, దీపావళి, క్రిస్మస్ పండుగ సమయంలోనూ ఈ విషయాన్ని గ్రహించినట్లు వారు అంటున్నారు. ఏటా భోగి పండుగకు వారం ముందు నుంచే వ్యాపారం జోరుగా సాగేది. రోజుకు తక్కువలో తక్కువ రూ.30వేలు వ్యాపారం అయ్యేది ఈ సారి ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఈ సారి సంక్రాంతి పండుగ వ్యాపారం సందడి కొన్ని దుకాణాల్లో కనిపిస్తుంది. ఎక్కువ శాతం దుకాణాల్లో వ్యాపారానికి ఉచిత బస్సు ప్రయాణం ప్రభావం పడింది.

## కమ్మ సత్రంలో క్యాలెండర్ అవిష్కరణ



**అద్దంకి , జనవరి 13,ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని కాకతీయ (అన్నదాన సత్రం కల్యాణ మండపం) కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో బల్లికురవ మండలం కొండాయ పాలెం గ్రామానికి చెందిన శివరామ్ గ్రానైట్ ప్రొప్రైటర్ ధూళిపాళ్ల రామ గోవిందు సౌజన్యంతో సింగరకొండలోని కాకతీయ కమ్మ సేవా సమితి కార్యాలయంలో మంగళవారం ఉదయం 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కమ్మ సేవా సమితి అధ్యక్షులుసందిరెడ్డి శ్రీనివాసరావు,ఉపాధ్యక్షులు బాలిన రామసుబ్బారావు,బిల్లపాటి రామాంజనేయులు, కాటా అంజయ్య, మల్లాది శ్రీనివాసరావు,గుళ్ళపల్లి సుబ్రహ్మణ్యం,కొంద్రగుంట హనుమంతరావు, బోడెంపూడిరామ మోహన్ రావు,వీరపనేని మురళీ,మారుపూడి శ్రీనివాసరావు (మేదరమెట్ల),కాటూరి వెంకటరావు(ఈదరఅగ్రహారం),సయింపు నరసింహా రావు,కమ్మ శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలి



**అద్దంకి , జనవరి 13, ప్రభాతవార్త**

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ మొక్కజొన్న లో కత్తెర పురుగు నివారణ కొరకు ఇమామెక్టిన్ బెంజోఏట్ మందు ను 1 గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. శనగ లో బెట్ట నివారణ కొరకు పొటాషియం నైట్రేట్ ఎకరాకు ఒక కేజీ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. ప్రతి రైతు తాము సాగు చేసిన పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు చాందిని, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నివాళులు



**కొరిసపాడు , జనవరి 13, ప్రభాతవార్త**

మండలంలోని కుర్రవానిపాలెం గ్రామంలో కొండ్రు శ్రీనివాసరావు మాతృమూర్తి జానకమ్మ ఇటీవల మృతిచెందగా రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం వారి నివాసానికి వెళ్లి జానకమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా మాలెంపాటి వారిపాలెంలో కొర్రపాటి ప్రభాకర్‌రావు ఇటీవలే అనారోగ్యంతో పరమపదించగా మంత్రి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## సింగరకొండ గాలి గోపురంకు విరాళం



**అద్దంకి, జనవరి 13,ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా అద్దంకి మండలం సింగరకొండ ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం ఒంగోలుకు చెందిన కారుసాల పున్నమ జ్ఞాపకార్థం వారి కుమారుడు రామారావు ధర్మపత్ని సుజాత దేవస్థానం ప్రకార మండపాలు గాలిగోపురాలు నిర్మాణాలు నిమిత్తం 100016 రూపాయలు విరాళము దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు పాలక మండలి అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకర్ రావులకు అందజేశారు. వీరికి దేవస్థానంలో స్వామివారి పూజా కార్యక్రమం తదనంతరం స్వామివారి ప్రసాదములు, శాలువాతో సన్మానించారు.

## బాతుల లారీ ఫల్టీ - 200 బాతుల మృతి





**బల్లికురవ జనవరి 13, ప్రభాతవార్త**

బ్రతుకుతెరువు కోసం బాతులు మేపుకుంటూ జీవనం సాగించే బాతుల రైతులపై విధి కన్నెర్ర చేసింది . ఉభయగోదావరి జిల్లాల నుండి బాతుల రైతులు వరి కోతలు పూర్తయిన పిమ్మట జనవరి, ఫిబ్రవరి మాసాలలో ప్రకాశం జిల్లాకు బాతుల మేత కోసం వస్తుంటారు. ఈ క్రమంలో పలు ప్రమాదాలకు కూడా గురవుతుంటారు.అద్దంకి నార్కట్పల్లి రాష్ట్రీయ రహదారిపై మంగళవారం రాత్రి మండలంలోని కొప్పెరపాడు వద్ద బాతుల లారీ అదుపుతప్పి డివైడర్ను ఎక్కటంతో ఫల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో 200 బాతులు మృతి చెందాయి. బాతుల రైతులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సర్వస్వం కోల్పోయిన కుటుంబ సభ్యులు, కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు .

## స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ గ్రామపంచాయతీలుగా

### రూపుదిద్దుకోవాలి: డిపిఓ వెంకటేశ్వరరావు



**కొత్తపట్నం జనవరి 13 ప్రభాతవార్త**

గ్రామాల్లోఎక్కడా కూడా చెత్తాచెదారం అనేది లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిపిఓ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ గ్రామపంచాయతీ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగాడిపిఓ వెంకటేశ్వరరావు, మాట్లాడతూ కొత్తపట్నం గ్రామంలో పర్యటన చేయడం జరిగింది అన్నారు,గ్రామాలు పండగ వాతావరణం కలిగే విధంగా స్వచ్ఛ సంక్రాత్రి స్వచ్ఛ గ్రామపంచాయతీలుగా రూపుదిద్దుకోవాలని తెలియజేశారు.వీధి లైట్లు పరిశీలించడం జరిగింది ఎస్ డబ్ల్యూ పిసి షెడ్యూలను విజిట్ చేసి అధికారులకు సూచనలు ఇవ్వడం చేశారు, ఇంటి పన్ను వసూలు క్రమంగా చేయాలని తెలియజేశారు. తమకు కేటాయించిన ప్రతి ఇంటిని ప్రతిరోజూ తప్పనిసరిగా సందర్శించాలనీ,తడి చెత్త - పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలనీ తెలిపారు. తాగునీటి నాణ్యతను పరీక్షించేందుకు వాటర్ టెస్టింగ్ నిరంతరం నిర్వహించాలి. వాల్వ్‌ల వద్ద నిల్వ నీటిని శుభ్రం చేసి, బ్లీచింగ్‌తో పరిశుభ్రత పాటించాలి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి శ్రీకృష్ణ డిప్యూటీ ఎంపీడీవో ఎన్ వేణు గోపాల్ కృష్ణ మూర్తి ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎం సచివాలయం సిబ్బంది, మరియు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ముప్పవరం గ్రామస్తుల భూ సమస్యకు త్వరలోనే

### పరిష్కారం తహశీల్దార్ పి సింగారావు

**జె. పంగులూరు జనవరి 13 ప్రభాతవార్త**

మండలంలోని ముప్పవరం గ్రామంలోని భూమి సమస్య మార్టూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత భూముల జాబితాలో ఉన్నందున క్రయ విక్రియాలు జరుగుటలేదు. ముప్పవరం గ్రామ కంఠం జాబితాలో నుండి తొలగించి నారు. జీవో ఎంఎస్ నెంబర్ 187 తేది 2752015 గ్రామకంఠం నిషేధిత భూముల సర్వే నెంబర్ 247 విస్తీర్ణ విస్తీర్ణం 11.40 ఎకరాలు గత 14 సంవత్సరాల నుండి అనగా 2012 ఉంది అమ్మకాలు కొనుగోలు జరుగుటలేదు. గ్రామ ప్రజలు ఇబ్బందుల్లో క్రయ విక్రయాలు సాదా అగ్రిమెంట్లు ద్వారా జరుగుతున్నవి. ప్రజలకు ఇబ్బంది రిజిస్ట్రేషన్లు జరగనందున ప్రత్యానికి రెవెన్యూ ఆదాయమునకు గండి పడింది. సమస్యను గ్రామస్తులు మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి గొట్టిపాటి తాసిల్దార్ పోవూరి. సింగారాలు కు సమస్యను వెంటనే పరిష్కరించమని ఆదేశించారు. తాసిల్దార్ సమస్యను జిల్లా కలెక్టర్ రాంబాబు కు దృష్టికి తీసుకువెళ్లగా నివేదిక ను పంపించమని ఆదేశించి గా తాసిల్దార్ అద్దంకి ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న ద్వారా నివేదికను పంపించమన్నారు. ముప్పవరం గ్రామస్తుల సమస్యను త్వరలోనే పరిష్కారం అందుతుందని తాసిల్దర్ పి సుంగారావు తెలియజేశారు.

## 20న శ్రీ లక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**రాచర్ల, జనవరి 13 ప్రభాతవార్త**

మండలంలోని జెపి చెరువు గ్రామంలో ఈనెల 20వ తేదీ శుక్రవారం శ్రీశ్రీశ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ ్మ అమ్మవారి నూతన దేవాలయంలో సంప్రోక్షణ మరియు శ్రీ లక్ష్మీ ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ బుధవారం నుండి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 20వ తేదీ శుక్రవారం విగ్రహ ప్రతిష్టతో కార్యక్రమాలు ముగుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని వారన్నారు.

## గ్రామీణ ప్రాంతాలలో క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

### - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ





**దర్శి, జనవరి 13, ప్రభాతవార్త**

సంక్రాంతి సంబరాలలో భాగంగా మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో గొట్టిపాటి- నారపుశెట్టి మెగా క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌ను దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌లు తిలకించి అనంతరం పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేశారు.వారితోపాటు మాజీ శాసన సభ్యులు నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, సీఐ రామారావు,దర్శి ఎస్సై మురళి, తాళ్లూరు ఎస్సై మల్లిఖార్జునరావు, దర్శి తహసీల్దార్ శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

**బహుమతులు స్పాన్సర్ చేసిన వారు :**

మొదటి బహుమతి రూ.1,20,000 దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ, రెండవ బహుమతి రూ.70వేలు దర్శి మన్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మూడవ బహుమతి రూ.50,000 దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి- సుబ్బారావు, నాల్గవ బహుమతి రూ.30,000 కంచుమాటి శ్రీనివాసరావు నీటి సంఘం డీసీ ముండ్లమూరు మండలం, ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ ఇలాంటి క్రీడా పోటీలలో గ్రామీణ యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాలు బయటకు వస్తాయని ఎంతో ఉత్సాహంగా, ఉత్తేజంగా క్రికెట్ పోటీలు కోడి పందాలు, పేకాట గంజాయి, అసాంఘిక నృత్యాలకు దూరంగా పల్లెల వాతావరణానికి అనుకూలంగా క్రికెట్ పోటీలు, వాలీబాల్ పోటీలు, కబడ్డీపోటీలు, మహిళలను ఆకట్టుకునే ముగ్గుల పోటీలు, ఎడ్ల పందాలు ఇలా ప్రతి పల్లెల్లో సంక్రాంతి సందడికి మన కూటమి ప్రభుత్వం స్వాగతిస్తూ దర్శి ప్రాంతంలో ప్రతి గడపలో సంక్రాంతి వెలుగులు నిండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు కాట్రాజు నాగరాజు, మండల పార్టీ అద్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీను, పిడతల నెమిలయ్య, దర్శి టౌన్ టీడీపీ అధ్యక్షులు చిన్నా, కంచుమాటి శ్రీనివాసరావు, వెలుగొండారెడ్డి, నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడీ వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, నియోజకవర్గంలోని ప్రజలు, యువత, కూటమి శ్రేణులు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

## కసినపల్లెలో రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



**కొమరోలు, జనవరి 13, ప్రభాతవార్త**

కొమరోలు మండలం కసినపల్లె గ్రామంలో రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కొమరోలు జడ్‌పిటిసి సారె వెంకట నాయుడు టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు.జడ్పీటీసీ సారే వెంకట నాయుడు క్రికెట్ ఆడి యువతను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కసినపల్లి యూత్ గ్రామ పెద్దలు గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.

